ప్రజాశక్తి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం
జనవరి 7
2018
12 పేజీలు



బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు

పేదల జోలికొస్తే.. ఖబడ్దార్

- హత్యలతో కమ్యూనిస్టులను ఆపలేరు
- టిడిపి, వైసిపిలది కప్పదాటు రాజకీయం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

పాలకులు, కార్పొరేట్ శక్తులు పేదల జోలికొస్తే ఊరుకోబోమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు హెచ్చరించారు. సిపిఎం 23 జిల్లా మహాసభలు శనివారం విడవలూరులోని ఎస్.మురళీకృష్ణనగర్, అన్నె అనసూయమ్మ ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. సాయంత్రం స్థానిక అంకమ్మ దేవాలయంలో జరిగిన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి, టిడిపిలకు హెచ్చరిక చేస్తున్నామన్నారు. కోవూరు ప్రాంతానికి ప్రజా ఉద్యమాల చరిత్ర ఉందన్నారు.కమ్యునిస్టులపై దాడులకు పాల్పడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. 20ఏళ్ల కాలంలో జిల్లాలో 23మందిని మతోన్మాద శక్తులు, ఇతర భూస్వాములు దుర్మార్గంగా పొట్టన పెట్టుకున్నారన్నారు. ఎత్తి ఎర్రజెండా దించకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేస్తున్నారన్నారు. టిడిపి, వైసిపిలాగా డబ్బుకోసం రాజకీయ కప్పదాటు చేయడంలేదన్నారు. టిడిపి ప్రభుత్వం పేదల కడుపుకొట్టే పనిచేస్తుందన్నారు. కాలువగట్లపై నివసించే పేద ప్రజలకు ప్రత్యామ్నయం చూపకుండా ఇళ్లు తొలగించడం, చెరువులోతట్టు భూములపై పెత్తనాలు చేస్తుందన్నారు. 1930నుంచే కోవూరు పరిసర ప్రాంతాల్లో ఎర్రజెండా రెప రెపలాడుతుందన్నారు. ఓట్లు, సీట్ల కోసం కాకుండా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. టిడిపిలో గెలిచిన ప్రజా ప్రతినిధులు ఇక్కడ వైసిపిలోకి వెళతున్నారన్నారు. తెలంగాణలో టిడిపి ప్రజా ప్రతినిధులు టిఆర్ఎస్ తీర్థం పుచ్చుకుంటున్నారని తెలిపారు. తెలంగాణలో టిడిపి పూర్తిగా దెబ్బతినిందన్నారు. ఎపిలో కూడా ప్రజలు ఆ పార్టీని శంకరగిరి మాన్యాలు పట్టించనున్నారన్నారు. దళితులు, కార్మికులు ,బలహీన వర్గాలపై ప్రభుత్వం దాడులు చేస్తే సహించబోమన్నారు. నగరంలోని ముతుకూరు రోడ్డు, కాలువగట్లపై నివసిస్తున్న పేద వారి ఇళ్లను ప్రభుత్వం తొలగిం చిందన్నారు. నిర్వాసితులకు సిపిఎం అండగా నిలిచిందన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ భృతి కల్పిస్తామని ఆశచూపిందన్నారు. ఇప్పటి వరకూ పరిశీలించే పనిచేస్తుందన్నారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని సిఎం హామీ ఇచ్చారన్నారు. దాంతో మహిళలు ఆశగా ఎదురు చూడగా రుణం రద్దు కాలేదన్నారు. దాంతో వడ్డీ పెరిగిందన్నారు. మూడున్నరేళ్లలో టిడిపి అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. చంద్రబాబు పరిస్థితి ఇలా ఉంటే వైసిపి నేత జగన్ పాదయాత్ర చేస్తూ అమలు కాని హామీలిస్తున్నారన్నారు. వైసిపి నవరత్నాలు అమలు చేయాలంటే లక్షా, 50వేల కోట్ల రూపాయల నిధులు కావాలన్నారు.సిపిఎం కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ 2014ఎన్నికల సమయంలో అభివృద్ధి రేటు 7.5శాతం ఉండగా ఇప్పుడు 6.1శాతానికి తగ్గిందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత అమాయకులు, బలహీనవర్గాలపై దాడులు పెరిగాయన్నారు. దేశద్రోహులుగా ముద్రవేసి దాడులు చేస్తున్నారన్నారు. ముస్లిములు ఆవులు మేపేందుకు వెళుతున్నా దాడులకు ఒడిగడుతున్నారన్నారు. పద్మావతి సినిమాను విడుదల కాకుండా అడ్డుకొని గుజరాత్ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూసిందన్నారు. తాలిబన్లుకన్నా ఆర్ఎస్ఎస్ నియంతృత్వంగా వ్యవహరిస్తుందన్నారు. దానిని దేశంలో నిషేధించాల్సిన అవసరం ఉందన్నారు. ఢిల్లీలోని మహిళలకు రక్షణలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. మహారాష్ట్రలో దళితులపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. బిజెపి పాలనలో ఏ ఒక్కరికీ రక్షణ లేదన్నారు.

మిగతా 4లో





విడవలూరులో జరిగిన సిపిఎం జిల్లా మహాసభల భారీ ర్యాలీలో అగ్రభాగాన అభివాదం చేస్తున్న పి మధు, విఎస్ఆర్, చంద్ర రాజగోపాల్, తదితరులు

విడవలూరులో కదంతొక్కిన ఎర్రసైన్యం

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

విడవలూరు వీధుల్లో ఎర్రసైన్యం కదం తొక్కింది. సిపిఎం 23వ జిల్లా మహాసభల సందర్భంగా శనివారం నిర్వహించిన ప్రదర్శనతో ఆ ప్రాంతం ఎరుపెక్కింది. ఎటు చూసినా అరుణ పతాకాల రెపరెపలే కనిపించాయి.1974తర్వాత కమ్యునిస్టులు ఈ ప్రాంతంలో ఇంతటి ర్యాలీ చేయడం ఇదేనని ప్రజలు ఆసక్తిగా చర్చించారు. మహిళలు, యువకులు పెద్ద ఎత్తున జిల్లా నలుమూలల నుంచి తరలొచ్చారు. కార్యకర్తల నినాదాలతో విడవలూరు వీధులు మారు మ్రోగాయి. ప్రజలు ఇళ్ల నుంచి బయటకొచ్చి ర్యాలీని ఆసక్తిగా తిలకించారు. ఈ ర్యాలీ కమ్యునిస్టుల్లో నూతన ఉత్తేజాన్ని ఉత్సాహాన్ని నింపింది.

మధ్యాహ్నం మూడు గంటలకు లారీలు, బస్సులు, ఆటోలు పెద్ద ఎత్తున విడవలూరు వైపు వచ్చాయి. సాయిమందిరం ప్రాంగణం వద్ద డప్పు కళాకారులు విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలొచ్చిన మహిళలు, యువకులు, రైతులు, కార్మికులతో ఆ ప్రాంతం నిండిపోయింది. సాయంత్రం ఐదుగంటలకు ర్యాలీ ప్రారంభమైంది. అగ్రభాగాన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్, కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, పులిగండ్ల శ్రీరాములు, మూలం రమేష్, జొన్నలగడ్డ వెంకమరాజు, పొట్టేపాళెం చంద్రమౌళి నడిచారు.డప్పు కళాకారులు కదం తొక్కుతూ పదం పాడుతూ ముందుకు సాగారు.

మిగతా 4లో

నెల్లూరుకు ఔటర్ రింగ్‌రోడ్డు

జన్మభూమి సభలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి- నెల్లూరు సిటీ ప్రతినిధి

నెల్లూరుకు అభివృద్ధి అదవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఔటర్‌రింగ్ రోడ్డు ఏర్పాటుకు విదివిధానాలు రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. జిల్లాలోని కోడూరు పాడులో ఐదో విడత జన్మభూమి -మా వూరు సభలు శనివారం జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ రెండు వేల మందికి పట్టణ ప్రాంతంలో ఇళ్లు మంజూరు చేస్తున్నానని ప్రకటించారు. మాజీ మంత్రి ఆదాల ప్రభాకరరెడ్డి అడిగారని వివరిస్తూ రెండు కిలోమీటర్లు కోడూరు పాడు నుంచి మంజూరు చేస్తున్నానని చెప్పారు. నెల్లూరు నాలుగుకిలో మీటర్లు రోడ్డు నేషనల్ హైవే నుంచి కోడూరు పాడు ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ వరకూ, బైపాస్ రోడ్డు కనెక్ట్ చేసి కొత్త కాలువ నుంచి రాముడకు పాలెం వరకూ బైపాస్ వేయనున్నట్లు తెలిపారు. 15 గ్రామాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు మున్సిపాలిటీకి నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. పింఛన్ల పంపిణీ గురించి మాట్లాడుతూ ప్రస్తుతం కేటాయించిన వాటికి అదనంగా మరో వెయ్యి మందికి పింఛన్లు మంజూరు చేస్తున్నానని తెలిపారు. ఏడాదికి 35 శాతం విమానయానం పెరుగుతోందని బొగాపురం, కర్నూలు, దగదర్తి, మూడు కొత్త ఎయిర్ పోర్టులు వస్తున్నాయని తెలిపారు. కృష్ణపట్నంలో మరో ఎస్ఇజెడ్ రానుందని చెన్నయ్, తిరుపతి ఇండస్ట్రియల్ కారిడార్‌గా మారనున్నాయని తెలిపారు.కాకినాడ నుంచి పాండిచ్చేరి వరకూ బకింగ్ హమ్ కెనాల్‌పైనా జలరవాణా రానుందని తెలిపారు.విద్యార్థులు మట్టిలో మాణిక్యాలు, వారిని సరిగా మలిస్తే ప్రపంచాన్ని జయించేశక్తి వారికి ఉందని కొనియాడారు. అభివృద్ధికి, సంపద సృష్టికి, నాగరికతకు చిహ్నం మౌళిక సదుపాయాలని వివరించారు. పరిశ్రమలు



పొదుపు మహిళలకు చెక్కు అందజేస్తున్న సిఎం చంద్రబాబునాయుడు

మిగతా 4లో

సమస్యల పరిష్కారమే జన్మభూమి లక్ష్యం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించడమే జన్మభూమి- మా ఊరు గ్రామ సభల లక్ష్యమని సర్వేపల్లి నియోజకవర్గ నోడల్ అధికారి షేక్, నయా ముల్లా వెల్లడించారు. శనివారం మండలంలోని నక్కా వారిపాళెం, చిన్నచెరుకూరు గ్రామాలలో జన్మభూమి-మా ఊరు గ్రామ సభలు జరిగాయి. నక్కావారిపాళెంలో ఎంపిడిఒ కన్నం హేమలత ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సభకు నోడల్ అధికారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జన్మభూమి గ్రామ సభలను ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ గ్రామ సభలకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యేలా నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. తొలుత ఎంపిడిఒ హేమలత, డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వర్లు సారధ్యంలో ఆత్మగౌరవ దీక్ష ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో అన్ని ప్రభుత్వ శాఖల ప్రతినిధులు, స్థానిక విలేజ్ రెవెన్యూ అధికారి శ్రీనివాసన్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. చిన్నచెరుకూరు పంచాయతీలో తహశీల్దార్ పుల్లయ్య ఆధ్వర్యంలో జన్మభూమి-మా ఊరు గ్రామ సభ జరిగింది. గ్రామ సభలలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రామ సభలకు ప్రజల నుంచి విశేష స్పందన కనిపించడంతో అధికారులు జోష్‌తో ఉన్నారు.

చిట్టమూరు : మండలంలోని మెట్టు, ఉప్పలమర్తి గ్రామాల్లో శనివారం జన్మభూమి కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక సర్పంచ్‌లు మురళి, చెంగమ్మల అధ్యక్షతన ఎంపిడిఒ సురేష్‌బాబు, తహశీల్దార్ చంద్రశేఖర్‌లు ఈ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ గణపతి కిశోర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



టిపిగూడూరులో లబ్ధిదారులకు పత్రాలిస్తున్న అధికారులు

ముత్తుకూరు: జన్మభూమి కార్యక్రమం శనివారం మండలంలోని పంటపాళెం, పైనాపురం పంచాయతీల్లో, బ్రహ్మదేవం పంచాయతీలో జరిగినిన సభలు జరిగాయి. పంటపాళెంలో జరిగిన గ్రామ సభలో గ్రామస్తులు తమకు రేషన్ కార్డులు ఇవ్వలేదని, ఫించన్లు ఇవ్వలేదంటూ అధికారులను ప్రశ్నించారు. అయితే ప్రభుత్వం మంజూరు చేయలేదని మంజూరైన వెంటే ఇస్తామని తహశీల్దార్ చెన్నయ్య వారికి బదులిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రంగనాథ్, వివిధ శాఖ అధికారలు పాల్గొన్నారు. అనంతరం సామూహిక సీమంతాలు జరిపించారు. పైనాపురంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పట్టపు రమేష్ అధ్యక్షత వహించారు. జెన్‌కో బూడిద చెరువును తమ గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయాలని దేవరదిబ్బ గిరిజనులు అధికారులను కోరారు.

ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేకాధికారి టి. సోమయ్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం : మండల పరిధిలో నెలకొన్న సమస్యలను గుర్తించి ప్రభుత్వ పథకాలు ఎలా అమలవుతున్నాయో తెలుసుకునేందుకు ప్రభుత్వం జన్మభూమి మావూరు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని విద్యాశాధికారి దిలీప్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని పంచేడు, వవ్వేరు గ్రామల్లో శనివారం జరిగిన జన్మభూమి కార్యక్రమాలలో ఎంపిడిఒ సుజాతతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వచ్చిన అర్జీలను కంప్యూటర్‌లో నమోదు చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రవీంద్రబాబు, ఎఒ నీరజ, సిడిపిఒ సౌజన్య, ఐకెపి ఏపిఎం సుమన, పలు శాఖల అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



చిట్టమూరులో జరిగిన జన్మభూమి కార్యక్రమం



విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-చిట్టమూరు

మండలంలోని కారెంపాటిదిబ్బ పాఠశాలలోని విద్యార్థులకు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయురాలు విజయ తన చెల్లెలి కుమారుడు పుట్టిన రోజు సందర్భంగా ఈ దుస్తులను పంపిణీ చేశారు. దీనికి ఆమె మామ వెంకటరెడ్డి ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో అరవపాళెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మినరసింహరావు ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

సత్తాచాటిన విశ్వభారతి విద్యార్థులు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాళెం

ఫ్లెమింగో ఫెస్టివల్‌ను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలలో బుచ్చి విశ్వభారతి విద్యానికేతన్ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించారు. ఆంగ్ల ఉపన్యాసం విభాగంలో బి.హారిక, షేక్. నర్మిన్, ఎం. కార్తీక్, వ్యాసరచనలో మేఘన, ప్రవల్లిక, ఎం.దీపిక, జూనియర్ విభాగంలో సాయిధనుష్, వి. ధనుష్‌లు 8 బహుమతులు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్. మస్తాన్ సాహెబ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయనతో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది.

నేడు 5కె రన్

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

జన్మభూమి గ్రామ సభ సందర్భంగా ఇందుకూరుపేట మండలంలో ఆదివారం జరిగే గ్రామసభల సందర్భంగా 5కెరన్ నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయం నుంచి 5కె రన్ జరుగుతుందని తెలిపారు. కొత్తూరులో జన్మభూమి గ్రామసభ జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమాలకు అధికారులు, యువకులు, విద్యార్థులు, నాయకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. 5కెరన్ ఉదయం 6గంటల నుంచి 7.30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. అందరూ 6 గంటలకే హాజరు కావాలని కోరారు.

సిఎం వైఖరికి నిరసనగా మత్స్యకారుల ఆందోళన

ప్రజాశక్తి - ముత్తుకూరు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశాఖపట్నంలో మత్స్యకారులను దుర్భాషలాడినందుకు నిరసగా తహశీల్దార్ కార్యాలయం ఎదుట వైసిపి ఆధ్వర్యంలో స్థానిక మత్స్యకారులు ఆందోళన నిర్వహించారు. ఈ సందరభంగా వైసిపి మత్స్యకార విభాగం మండల అధ్యక్షులు అక్కయ్యగారి శివ మాట్లాడుతూ మత్స్యకారులకు గత ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకి వస్తే మత్స్యకారులను ఎస్‌టిల్లో చేరుస్తానని హామీ ఇచ్చారన్నారు. గెలిచి నాలుగేళ్లు అవుతున్నా నేటికీ ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు. దాంతో తమ కులానికి చెందిన మత్స్యకారులు విశాఖపట్నంలో శాంతి యుతంగా నిరాహార దీక్ష చేశారనానరు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారం కోసం స్థానిక ఎంఎల్‌ఎ ఆధ్వర్యాన వారు ముఖ్యమంత్రి వద్దకు వెళితే మత్స్యకారులను తోలుతీస్తా, తమాషా చేస్తున్నారా, ఆందోళన చేస్తే దిగి వస్తాననుకుంటున్నారా అంటూ పరుష పదజాలం ఉపయోగించారన్నారు. ఆయన వైఖరి తమ మనోభావాలను దెబ్బతీసిందని తెలిపారు. తొలుత బస్టాండు సెంటర్ నుండి ప్రదర్శనగా తహశీల్దార్ కార్యాలయం వరకు వెళ్లారు. అక్కడున్న గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కుమారి రమేష్‌బాబు, బుచ్చింగారి పోలయ్య, పకీరయ్య, కనకయ్య, పామంజి చిన ఏడుకొండలు, కోలంగారి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

ముఖ్యమంత్రి సభకు స్కూలు బస్సులు

ప్రజాశక్తి - ముత్తుకూరు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం కోడూరు పాడుకు రావడంతో ఆయన సభకు మండలంలోని ప్రయివేట్ పాఠశాలల బస్సులు జనాన్ని తరలించాయి. మండలంలోని అన్ని ప్రయివేట్ పాఠశాలల బస్సులను నాయకులు ఏర్పాటు చేశారు. ఈమండలం లోనివే కాకుండా నెల్లూరు రూరల్ మండలం ధనలక్ష్మీ పురం, కాకుపల్లిలోని ప్రయివేట్ పాఠశాలల బస్సులను కూడా ఉపయోగించుకొన్నారు. ఈ బస్సులు అన్ని పసుపు రంగులో ఉండడం, టిడిపి జెండా కూడా పసుపు కావడంతో ప్రత్యేకంగా కనిపించింది. ప్రతి పర్యాయం ముఖ్యమంత్రి సభలకు ఆర్‌టిసి బస్సులను, ప్రయివేట్ బస్సులను వాడేవారు.

ప్రభుత్వ ఉద్యోగులా.. టిడిపి కార్యకర్తలా?

వైసిపి విద్యార్థి సంఘం ఆగ్రహం

ప్రజాశక్తి-మనుబోలు

ప్రభుత్వ ఉద్యోగులను, అంగన్‌వాడీ కార్యకర్తలను, ఆయాలను సిఎం సభకు తరలించారని, వారు ఉద్యోగులా, లేక టిడిపి కార్యకర్తలా అని వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆవుల తులసీరామ్ యాదవ్ ప్రశ్నించారు. మనుబోలులోని గిరిజనకాలనీలో అంగన్‌వాడీ కేంద్రం ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేశారు. కోడూరుపాడులో జరిగిన జన్మభూమి కార్యక్రమానికి సిఎం వస్తారని జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలను, ఆయాలను తరలించారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగులను ఎలా పంపుతారని ప్రశ్నించారు. అంగన్‌వాడీ కేంద్రాలు నడవక చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఇబ్బంది పడ్డారని తెలిపారు. సిఎం మెప్పు పొందేందుకే అధికారులు ఇలా వ్యవహరించారని తెలిపారు. దీనిపై జిల్లా అధికారులను నిలదీస్తామన్నారు. ఇప్పటికే జన్మభూమి పేరుతో ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను మూసివేస్తున్నారని తెలిపారు. రోజుకో ర్యాలీ పేరుతో విద్యార్థులను రోడ్డుపైకి తీసుకొచ్చి ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వంశీ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

జన్మభూమి కమిటీలతో మోసాలు

- సిపిఎం కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - విడవలూరు

టిడిపి నాయకులు, ప్రజా ప్రతినిధులు జన్మభూమి కమిటీల పేరుతో పేదవారిని మోసం చేస్తున్నారని కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యయలు వంకాయలపాటి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం విడవలూరు అమరజీవి స్వయంపాకుల మురళి కృష్ణానగర్ అన్నె అనసూయ ప్రాంగణంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జన్మభూమిని అధికార పార్టీ ఆర్బాటాల కోసమే జరుపుతుందని. ప్రభుత్వ పథకంలా జరపడంలేదన్నారు. విజయనగరం జిల్లాలో జన్మభూమికి ప్రజలనను రానివ్వకుండా వారి సమస్యలు ముఖ్యమంత్రికి తెలపకుండా దళితులపై టిడిపి నాయకులు దాడులు చేశారన్నారు. గాయపడినవారు వారి బంధువులతో కలిసి హాస్పిటల్‌కు వెళుతుంటే వారిని మార్గ మధ్యంలో ఆపి పోలీసు సమక్షంలోనే దాడిచేశారని మండిపడ్డారు. వెంటనే వారిపై అట్రాసిటి కేసులు నమోదుచేసి అరెస్టులు చేయాలని డిమాండ్ చేశారు. పేద ప్రజల గొంతునొక్కేందుకే ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కూడా మహారాష్ట్రలో దళితులపై దాడులు జరపడంతో అమాయకులైన కూలిరైతులు బలైపోయారన్నారు. బిజెపి దళిత, ప్రజావ్యతిరేక ప్రభుత్వమని ఆయన దుయ్యబట్టారు. ఇంత జరుగుతున్నా ప్రధాని మోడీ స్పందించకపోవడం దారుణమన్నారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్‌లో ఏప్రిల్ 18న అఖిలభారత సిపిఎం మహాసభలను నిర్వహిస్తామన్నారు. దీనిద్వారా దుర్మార్గ పాలన నిర్వహిస్తున్న బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా ముందుకు వెళ్లేందుకు చర్యలు చేపడతామన్నారు.



మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

చంద్రబాబువి అబద్ధాలమాటలు

సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్

రాష్ట్రాన్ని సింగపూర్, మలేషియాలా తీర్చిదిద్దుతానని అబద్ధాల మాటలు చెప్పడం చంద్రబాబుకే తగునన్నారు. ఇప్పటికే జిల్లాలో ఎంతోమంది పేదప్రజలు డెంగ్యూ, వివిధ జ్వరాలబారిన పడి అప్పులు చేసుకుని లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా పట్టించుకోని చంద్రబాబు జిల్లాకు గోదావరి, కృష్ణా జలాలు పెన్నానదికి తీసుకొస్తానని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికి 6 సార్లు నెల్లూరుకు వచ్చిన చంద్రబాబు సంగం, నెల్లూరు బ్యారేజీలను పూర్తిచేసి డెల్టాకు పుష్కలంగా నీరందిస్తానని చెప్పడమే కాని, అవి పూర్తయిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్రంలో అనేక పరిశ్రమలు తెచ్చి ప్రతిఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పారేకాని, అవి నెరవేర్చిందేలేదన్నారు. అదే విధంగా జిల్లాలో ప్రభుత్వ స్కూల్స్, హాస్టళ్లను మూసివేస్తున్నారన్నారు. ప్రైవేటు కార్పొరేటు సంస్థలకు టిడిపి అండగా నిలబడుతుందన్నారు. పేదల కోసం పోరాడేది ఎర్రజెండా మాత్రమేనని ఆయన అన్నారు.

విద్యా, వైద్యం ఖరీదయ్యాయి

మిరియం వెంకటేశ్వర్లు, సిపిఎం రాష్ట్ర కమిటీ నాయకులు

పేద ప్రజలకు విద్య, వైద్యం అందుబాటులో లేకుండా పోయాయని, ఇదే తెలుగుదేశంపార్టీ అభివృద్ధి అని సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటి సభ్యులు మిరియం వెంకటేశ్వర్లు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చంద్రబాబు మాటలు చూస్తే చిన్నపిల్లలకు అన్నంపెట్టేటపుడు చందమామ రావే.. జాబిల్లి రావే అని అన్నంపెట్టినట్లుగా ఉన్నాయని ఆయన ఎద్దేవా చేశారు. బిజెపి ప్రభుత్వం నోట్లను రద్దుచేసి దేశానికి ఒరగబెట్టింది ఏమిటన్నారు. దీనిద్వారా నల్లధనమంతా బిజెపి నాయకులు, బడా పారిశ్రామికవేత్తలు తెల్లధనంగా మార్చుకున్నారన్నారు. నోట్లమార్పిడి కోసం 200ల మంది పేద ప్రజలు బ్యాంకు క్యూ లైన్లలో నిలబడి మృతిచెందారన్నారు.

ముదువర్తి భూములను

దళితులకు పంచుతాం

విడవలూరు మండల కార్యదర్శి తుళ్లూరు గోపాల్

విడవలూరు మండలంలోని ముదువర్తి గ్రామంలో ఉన్న రేబాల సుందరామిరెడ్డి భూములను దళితులకు పంచుతామని హామీ ఇచ్చారు. భూసమస్యలపై, కార్మిక సమస్యలపై పోరాడతామని ఆయన పిలుపునిచ్చారు.



జెండాను ఆవిష్కరిస్తున్న సీనియర్ నాయకులు జక్కా వెంకయ్య

విడవలూరు అరుణ వర్ణం

ప్రజాశక్తి - విడవలూరు

విడవలూరంతా ఎర్రజెండాలతో ఎరుపెక్కింది. విడవలూరు సాయిబాబా కళ్యాణమండపం నుండి పెద్దఎత్తున భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విడవలూరు మండలం అలగానిపాడు నుంచి పుచ్చలపల్లి సుందరయ్య జ్యోతిని తీసుకుని సిపిఎం వర్ధిల్లాలంటూ ముందుకు వచ్చారు. నెల్లూరు పట్టణంలో ర్యాడికల్ గూండాలచే హత్యచేయబడిన కామ్రేడ్ వి.మాలకొండారెడ్డి, ఎండి మన్సూర్ జ్యోతిని, నెల్లూరు పట్టణంలోని బిజెపి కిరాయి హంతకులచే హత్యకు గురైన గోను చలపతి, మేకల చెంచయ్య, కొడవలూరు మండలం ఎల్లాయపాలెం భూ పోరాటంలో పోలీసు కాల్పుల్లో మృతిచెందిన గాలంకి తిరుపాలు, వివిధ అమరవీరుల జ్యోతులను జిల్లా నలుమూలల నుండి కామ్రేడ్స్ తీసుకువచ్చి, రాష్ట్ర సిపిఎంకార్యదర్శి మధు, కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావులకు అందచేశారు.

పార్టీ జెండాను ఆవిష్కరించిన జక్కా వెంకయ్య

విడవలూరులో నిర్వహించిన సిపిఎం 23వ మహాసభల్లో తొలుత సీనియర్ నాయకులు జక్కా వెంకయ్య పార్టీ జెండాను ఆవిష్కరించి, అనంతరం దక్షిణ భారతదేశ ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య స్థూపంవద్ద నివాళులర్పించారు.

ఆకట్టుకున్న ప్రజానాట్యమండలి

సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజా నాట్యమండలి కళాకారులచే నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. జిల్లా నలుమూలల నుండి కదలి వచ్చిన సిపిఎం నాయకులు, కార్యకర్తలను విడవలూరు పార్టీ కవిటీ సభ్యులు ఘనంగా ఆహ్వానించారు.

డప్పుల శబ్దంతో మారుమ్రోగిన విడవలూరు

మహాసభల సందర్భంగా విడవలూరుకు జిల్లాలో ఉన్న డప్పు కళాకారుల దళాలు పాల్గొని వారి విన్యాసాలతో డప్పు మోగించడంతో విడవలూరు ఒక్కసారిగా శబ్ధధ్వనితో మారుమ్రోగింది.

అమరవీరులకు జోహార్లు

ఈ మహాసభకు అధ్యక్ష వర్గంగా పి.శ్రీరాములు, ఎం.యాదగిరి, ఎస్‌కె.మస్తాన్‌బిలు వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా మూలే వెంగయ్య సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. సిపిఎంలో పనిచేస్తూ అమరులైన నాయకులకు, కార్యకర్తలకు ఘననివాళులర్పించారు.

ఈ సందర్భంగా స్టీరింగ్ కమిటి పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు చంద్ర రాజగోపాల్, జక్కా వెంకయ్య, పొట్టేపాళెం చంద్రమౌళి, పి.శ్రీరాములు, ఎం.మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, జొన్నలగడ్డ వెంకమరాజు, మూలం రమేష్‌లతో ఏర్పాటయింది. మినిట్స్ కమిటి కత్తి శ్రీనివాసులు కన్వీనర్‌గా ఎ.తిరుపాల్, కె.పెంచల నర్సయ్యలతో కమిటీ వేశారు. గోగుల శ్రీనివాసులు కన్వీనర్‌గా గోనె దయాకర్, కతారి అజయ్‌కుమార్‌లతో కూడిన తీర్మానాల కమిటి ఏర్పాటు చేశారు. పివివి.ప్రసాద్ కన్వీనర్‌గా వెంకటరమణయ్య, బాలసుబ్రహ్మణ్యంలతో అర్హతల కమిటి ఏర్పాటైంది.

స్కూటరిస్టుకు గాయాలు

ప్రజాశక్తి - కావలి రూరల్

గుర్తు తెలియని ఆటో ఢీకోనడంతో స్కూటరిస్టుకు గాయాలైన సంఘటన మండల పరిధిలోని మన్నంగిదిన్నె ఎస్‌సి కాలనీలో శనివారం చోటు చేసుకుంది. కావలి రూరల్ ఎఎస్‌ఎ డేవిడ్‌దాస్ తెలిపిన సమాచారం మేరకు లింగంగుంట గ్రామానికి చెందిన అన్నపల్లి కిషోర్ పనుల నిమిత్తం కావలి వస్తుండగా అటు నుంచి వస్తున్న గుర్తు తెలియని ఆటో ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. స్థానికులు సమాచారం తెలపడంతో సంఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రుడిని కావలి ప్రభుత్వ ఏరియాకు తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పలు గ్రామాల్లో 'జన్మభూమి - మా ఊరు'

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని చింతలదేవి, ఉప్పలూరు పంచాయతీల్లో జన్మభూమి – మా ఊరు కార్యక్రమం శనివారం అధికారులు నిర్వహించారు. ఉప్పలూరులో సర్పంచ్ ఓరుగంటి లలితకుమారికి బదులుగా ఆమె భర్త ఓరుగంటి మస్తాన్ గ్రామసభకు అధ్యక్షత వహించారు. ముఖ్యమంత్రి పంచాయతీ సర్పంచ్‌లే అధ్యక్షత వహించాలని చెబుతున్నప్పటకీ మహిళాసర్పంచ్‌లు ఎన్నికైన స్థానంలో వారి భర్తలు పెత్తనం చెలాయిస్తున్నారు. ఒకదశలో చింతలదేవి సమీపంలో సోమశిల ఉత్తరకాలువ త్రవ్వకాల్లో భూములను కోల్పోయిన రైతులు వారికి నష్టపరిహారం ఇప్పటివరకు ఇవ్వలేదని స్థానికులు గ్రామసభను అడ్డుకున్నారు. మండల కన్వీనర్ బొట్లగుంట హరిబాబు అధికారులను కాంట్రాక్టర్‌ను పిలిపించి నష్ట పరిహారం ఇప్పిస్తానని హామీ ఇవ్వడంతో గొడవ సద్దు మణిగింది. చింతల దేవిలో గ్రామ సర్పంచ్ ఓరుగంటి అంకమ్మ ఆధ్వర్యంలో గ్రామసభ జరిగింది. ఎన్‌డిసిసిబి డైరక్టర్ యారవ కృష్ణయ్య, జెడ్‌పిటిసి మహేశ్వరరావు, ఎంపిడిఓ పిచ్చిబాబు, తహాశీల్దారు డి.ప్రమీల, ఎఎంసి మాజీ వైస్ ఛైర్మన్ గంటా లక్ష్మి నరసింహం, తెలుగుయువత అధ్య క్షులు శ్రీనివాసులు, తెలుగు రైతు అధ్యక్షులు రమేష్, మండల ఉపాధ్యక్షులు చంద్రబాబు పాల్గొన్నారు.



పేదల జోలికొస్తే...ఖబడ్దార్

మొదటి పేజీ తరువాయి

నిరుద్యోగ యువతకు రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పి కేవలం 85వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారన్నారు. ఈబహిరంగ సభకు విడవలూరు మండల కార్యదర్శి తుళ్లూరుగోపాల్ అధ్యక్షత వహించారు. సభలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మిరియం వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, పులిగండ్ల శ్రీరాములు, మూలం రమేష్, జొన్నలగడ్డ వెంకమరాజు, పొట్టేపాళెం చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల జ్యోతులు రాక

జిల్లా నలుమూలల నుంచి అమరవీరు జ్యోతులను మహాసభకు తీసు కొచ్చారు.బిజెపి గూండాల చేతుల్లో హత్యలకు గురైన బద్దేపూడి శీనయ్య, గోను చలపతి, చెంచయ్య జ్యోతులను నెల్లూరు రూరల్ సిపిఎం కమిటీ ఆధ్వర్యంలో మాదాల వెంకటేశ్వర్లు నాయకత్వంలో ఆప్రాంత నాయకులు సభాస్థలికి జ్యోతులను తీసు కొచ్చారు.అలగానిపాడు నుంచి పుచ్చలపల్లి సుందర య్య జ్యోతిని డి.కృష్ణ, మాల కొండారెడ్డి, మన్సూర్ అమరజ్యోతులను నెల్లూరు నగర కార్యదర్శి మూలం రమేష్, చంద్రారెడ్డి, యల్లాయపాళెం నుంచి గాలంకి తిరుపాల్ జ్యోతిని ఆయన తల్లి రమణమ్మ తీసుకొచ్చి బహిరంగ సభ వద్ద వి.శ్రీనివాసరావు, పి.మధుకు అందజేశారు.

అంగన్‌వాడీలకు వరాల జల్లు

ప్రజాశక్తి- నెల్లూరు సిటీ ప్రతినిధి

జిల్లాలోని కోడూరుపాడు గ్రామంలో శనివారం నిర్వహించి ఐదో విడత జన్మభూమి మా ఊరు సభకు పెద్ద ఎత్తున విద్యార్థులను అధికారులు తరలించారు. రెండు గంటలకు ప్రారంభం కావాల్సిన సభ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలస్యంగా రావడంతో .2.40 నిమిషాలకు ప్రారంభమైంది.2.45 నిమిషాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు జ్యోతి ప్రజ్వలనచేసి సభను ప్రారంభించారు. కృష్ణపట్నం పోర్టు ప్రైవేట్ సెక్యూరిటీ ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. సభ ప్రారంభానికి ముందు నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు వీక్షకులను అలరించాయి.గురుకృప కళాక్షేత్రం విద్యార్థులు స్వాగతం పలికారు...ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల విద్యార్థులు మా తెలుగుతల్లికి మల్లెపూదండ గీతాలాపనచేశారు.సభికులకు కలెక్టరు ఆర్. ముత్యాలరాజు వేదికపైకి ఆహ్వానించారు. రాష్ట్రంలో నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు, టీచర్లు ఇంగ్లీషులో రైమ్ పాడారు. అంగన్‌వాడీ చిన్నారులు సుమతి, వేమన శతకాలను రెండింటిని చక్కగా ఆలపించారు. మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి చొరవతో పడుగు పాడు అంగన్‌వాడీ చిన్నారులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. ముఖ్యంమంత్రి జాతీయ, రాష్ట్రస్థాయి కొన్ని క్విజ్ ప్రశ్నలు వేశారు. ముద్దు ముద్దు మాటలతో చిన్నారులు జవాబిచ్చిన తీరు అందరినీ మంత్ర ముగ్ధులను చేసింది.జవాబిచ్చారు. ముఖ్యమంత్రి ఓ చిన్నారిని ఎత్తుకుని ముచ్చటించారు. అనంతరం పడుగుపాడు అంగన్‌వాడీకేంద్రానికి వరాల జల్లు కురిపించారు. కేంద్రం నిర్మాణానికి రూ.20 లక్షలు, టీచరుకు రూ. 25 వేలు ఇన్సెంటివ్ ప్రకటించారు.తొలుత జెసిబిలను, ట్రాక్టర్లను లబ్ధిదారులకు అందచేశారు 2.50.నిమిషాలకు ప్రారంభమైన సిఎం ప్రసంగం 4.14 నిమిషాలకు ముగిసింది. సభ ముగిసే 30 నిమిషాల ముందే ప్రజలు వెనుతిరగడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. మున్సిపల్ జూనియర్ కాలేజీ, డక్కిలి రెసిడెన్షియల్ స్కూల్‌నుంచి 400 మంది విద్యార్థులు వచ్చారు.

విడవలూరులో కదం తొక్కిన ఎర్రసైన్యం

మొదటి పేజీ తరువాయి

ర్యాలీ సినిమా హాల్ సెంటర్, కామాక్షినగర్, సుందరయ్య వీధి, చెంబునికాలనీ, హరిజనవాడ, రామ్‌నగర్ కాలనీ, తూర్పు వీధి మీదుగా అంకమ్మ దేవాలయం వరకూ సాగింది. దారి పొడవునా ప్రజలు ఆసక్తిగా ర్యాలీని తిలకించారు. రెడ్‌షర్ట్ వాలంటీర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన అమరవీరుల జ్యోతులు కార్యకర్తల్లో, నాయకుల్లో ఉత్సాహాన్ని నింపాయి. విడవలూరు చరిత్రలో ఇంతటి ర్యాలీ జరగలేదని స్థానికులు చర్చించుకున్నారు.

మాకైతే రూ.కోటి ఖర్చు

కమ్యునిస్టుల క్రమశిక్షణకు అధికార పార్టీ కార్యకర్తలు ముగ్ధులయ్యారు. విడవలూరులో జరిగిన సిపిఎం ర్యాలీని ఆధ్యాంతం చూసిన టిడిపి నాయకులు, కార్యకర్తలు ముక్కున వేలేసుకున్నారు. 'ఎంతో క్రమశిక్షణగా పార్టీ జెండాను భుజాన వేసుకొని ఎక్కడెక్కడ నుంచో వచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. ఇదే సభ మా పార్టీ పెడితే కనీసం రూ.కోటి ఖర్చు అవుతుంది. వచ్చిన వారికి రూ.500లు, భోజనం పెట్టాలి. కమ్యునిస్టులు వారి ఖర్చులు వారే పెట్టుకొని సభకు వచ్చి ఉంటారు.' అని టిడిపి నాయకులు చర్చించుకోవడం కన్పించింది. మహిళలు, చిన్నారులు ర్యాలీని చూసి ఆనందం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మిద్దెలపైకి వచ్చి ర్యాలీని తిలకించారు.

నెల్లూరుకు ఔటర్ రింగ్‌రోడ్డు


మొదటి పేజీ తరువాయి

రావాలన్నా, టూరిజం అభివృద్ధి చెందాలన్నా, మన వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించాలన్నా మనకు కావాల్సిన వస్తువులు కొనుగోలు చేయాలన్నా మౌలిక సదుపాయాలు ఉంటే సజావుగా మార్కెట్లోకి వెళ్లే అవకాశం ఉంటుందని అన్నారు. కరెంటు, రోడ్లు, విమానాశ్రయాలు, రైల్వే లైన్ల అభివృద్ధికి కృషి చేస్తున్నానని తెలిపారు. పంచాయతీలకు, మున్సిపాలిటీలకు, ఫైనాన్స్ కమిషన్‌లకు వస్తున్న ఆదాయాలను సద్వినియోగం చేసేందుకు ప్రతి సోమవారం నీరు– ప్రగతి ద్వారా సమీక్షలు జరుపుతున్నామని అన్నారు. డ్వాక్రా, మెప్మా కార్యకర్తలు చంద్రన్న బీమా, పెళ్లికానుక, మధ్యాహ్న భోజనం, ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ కార్యక్రమాలను ఉద్యమ స్ఫూర్తితో పని చేస్తున్నారని అన్నారు గ్రామాల్లో వ్యర్థాలను సేకరించేందుకు పంచాయతీ అధికారులు, ఒక ఏజెన్సీ టీముగా వస్తారని తెలిపారు. తిరిగి ఎరువుగా మార్చి కావల్సిన వారికి అప్పచెప్పనున్నారు. మార్చి 31లోపు రాష్ట్రాన్ని పూర్తి స్థాయి ఓడిఎఫ్‌గా తీర్చిదిద్దేందుకు దృఢ సంకల్పంతో ఉన్నామని తెలిపారు. నేడు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో జరిగే 5కె రన్‌లో ప్రతి ఒక్కరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఆడ పిల్లల జోలికొస్తే కఠినంగా వ్యవహరిస్తామంటూ లా అండ్ ఆర్డర్ విఘాతం కల్గిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాలకు, పట్టణాలకు టెన్‌స్టార్స్ రేటింగ్ ప్రారంభించామని,ఇప్పటికే మంచి ఫలితాలు వస్తున్నాయని అన్నారు. విద్యుత్ రంగంలో రెండో సంస్కరణలు తీసుకురానున్నట్లు తెలిపారు. కరెంటు ఛార్జీలు పెరగవని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. అమరావతి నుంచి అనంతపురం వరకూ ఎక్స్‌ప్రెస్‌వే, ఆరోడ్లోనే కడప, కర్నూలుకు ఒక రోడ్డును తీసుకెళ్ల నున్నట్లు తెలిపారు, ఇదే నెల్లూరు జిల్లాలో ఒక రోడ్డు తీసుకుని ఎక్స్‌ప్రెస్‌వే తీసుకెళ్తున్నాం. ఒక వైపు రెండు రోడ్లు ఉంటాయని చెప్పారు.. బీచ్ రోడుతో నెల్లూరు జిల్లా ముఖ చిత్రం మార్చుతామని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి, మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరి నారాయణ, మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారి, మాజీ మంత్రి ఆదాల ప్రభాకర్ రెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడి శ్రీనివాసులు రెడ్డి, ఆనం రామనారాయణ రెడ్డి, మంత్రి అమర్‌నాథ్ రెడ్డి, బీద మస్తాన్‌రావు, ఎంఎల్‌సి బీద రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న నాయకులు





వెండి తెర

అర్చన : హలో
లీలామహల్ : ఎం.సిఎ,హలో
ఎస్-2 : స్క్రీన్ 1 : ఎం.సి.ఎ, హలో
స్క్రీన్ 2 : హలో



స్కీన్ 3 : టైగర్ జిందహై**ది సినిమా -స్క్రీన్ 1** టైగర్ జిందహై **స్కీన్2** ఎం.సి.ఎ.
స్కీన్ 3 :హలో

స్క్రీన్ 4 : , ఎం.సి.ఎ,
స్క్రీన్ 5 హలో
నర్తకి, **ఆక్సిజన్**
సిరి– స్క్రీన్ 1,ఒక్కక్షణం
:సిరి స్క్రీన్–2హలో
వినాయక: **స్పైడర్** కొత్తహాలు: అడవిరాముడు **గూడూరు :**
సంగం- రాజాది గ్రేట్ **సుందర మహల్-**: పైసా వసూల్,
శ్రీనివాసతేజ : వివేకం,
వి.సినిమాస్: బాహుబలి,
ఫాస్ట్అండ్ ఫ్యూరీయస్ 8, **కావలి: లత - రాజుగారి గదిమానస: స్పైడర్, స్రవంతి** – జై లవకుశ,
వెంకటేశ్వర : రాజాది గ్రేట్
ఆత్మకూరు: రామకృష్ణ- జవాన్ బావుడు శ్రీనివాస: జవాన్ రాధ, **బుచ్చిరెడ్డిపాళెం: రాజ్ కిషోర్-**




చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్ కోడి రూ.90
లేయర్ : కోడి రూ. 60
బ్రాయిలర్ చికెన్: రూ.146
స్కిన్‌లెస్ చికెన్: రూ.172
లేయర్ మాంసం 102





రైతుబజారులో కూరగాయల ధరలు (నిన్నటివి)

టమోటాలు	రూ.10.00
వంకాయలు	రూ.20.00
పచ్చిమిర్చి	రూ.20.00
ఉర్లగడ్డలు	రూ.20.00
క్యాబేజీ	రూ.20.00
క్యారెట్	రూ.50.00
బెండకాయలు	రూ.30.00
అల్లం	రూ.40.00
ఎర్రగడ్డలు	రూ.40.00
కాకరకాయలు	రూ.25.00
దొండకాయలు	రూ.20.00
చేమగడ్డలు	రూ.30.00
బీరకాయలు	రూ.40.00
దోసకాయలు	రూ.20.00
మామిడి కాయలు	రూ.120.00
అరటికాయలు	రూ.4.00
పందిరి చిక్కుళ్లు	రూ.35.00
గోరుచిక్కుళ్లు	రూ.25.00
బీట్రూట్	రూ.20.00
క్యాలీప్లవర్	రూ.20.00

బంగారం ధరలు

గ్రాము ధర: రూ.2,737
సవర ధర: రూ. 21,896
వెండి గ్రాము ధర:39.72
వెండి కిలో రూ.39,720





నిమ్మ మార్కెట్ ధరలు

గూడూరు: పెద్దవి రూ.2200, చిన్నవి రూ.1000
పొదలకూరు: పెద్దవి: రూ. 1800, సన్నవి రూ.900,



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

ముందస్తు సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - నెల్లూరు అర్బన్

స్థానిక నేతాజీ(ఎం.ఎస్.ఆర్) పైలట్ హైస్కూల్ శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆ పాఠశాల కరస్పాండెంట్ ఎం.వి సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సంస్కృతీ సాంప్రదాయాలు గురించి తెలుసుకోవాలని సూచించారు. సంక్రాంతి పండుగ విశిష్టత గురించి తెలిపారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ వేదవతి, డైరెక్టర్ నరేంద్రరెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ డి.వాణి, ఎన్.ప్రసన్న, ఎస్‌విఎల్ నరసింహారావు, పాల్గొన్నారు.



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న మల్లికార్జునరావు

సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - కావలి

సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక రెడ్‌క్రాస్ భవనంలో గడ్డం మల్లికార్జునరావు తన తండ్రి గడ్డం భక్తవత్సలరెడ్డి జ్ఞాపకార్థం 25 మంది విద్యార్థులకు నోటుబుక్స్, పేదలకు నెలసరి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దాత మామ బుర్లారఘుకుమార్‌రెడ్డి, దామిశెట్టి సుధీర్‌నాయుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పి.ఐ.జాఫర్‌ఖాన్, శ్రీపొట్టి శ్రీరాములు మున్సిపల్ ప్రైమరీ స్కూల్ హెచ్.ఎం అరుణ, వై.కిరణ్, సంయుక్త శాస్వతదాత నోటి ప్రసాద్‌రెడ్డిలు పాల్గొన్నారు.

సంయుక్త నిర్వాహకులు గంగ పట్నం సురేంద్ర ఆధ్వర్యంలో ఈ వితరణ కార్యక్రమాలు జరగడం విశేషం.

ఎస్‌సి వర్గీకరణకు మద్దతివ్వాలని వినతి

ప్రజాశక్తి - నెల్లూరు సిటీ

ఎస్‌సి వర్గీకరణకు భారత కమ్యూనిస్టు పార్టీ మద్దతు తెలపాలని కోరుతూ శనివారం ఎంఆర్‌పిఎస్ నాయకులు సిపిఐ కార్యాలయంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పార్థసారథికి వినతిపత్రం అందించారు. ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు మందా పెంచలయ్య మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణకు అన్ని పార్టీలు మద్దతు తెలిపాయన్నారు. బిజెపి ఎన్నికలో ఇచ్చిన వాగ్దానాలకు కట్టుబడి ఎస్‌సివర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, అంబేద్కర్, పాపయ్య, ప్రసాద్, ఉడతా వెంకట్రావు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

బాల మేధావికి ఘన సన్మానం

ప్రజాశక్తి -నెల్లూరు అర్బన్

పదేళ్ల వయసులోనే తన మేధా సంపత్తితో ప్రపంచ రికార్డులు నెలకొల్పుతున్న చిన్నారి తబీబ్ అహ్మద్‌ను పలువురు ఘనంగా సన్మానించారు. శనివారం స్థానిక పప్పుల వీధిలోని జాయిసిస్ కార్యాలయంలో జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో జరిగింది. డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఖగోళ శాస్త్రంలో అపరిమిత జ్ఞానాన్ని కలిగిన ఆ చిన్నారి మేధావులు, న్యాయనిర్ణేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పి అబ్బురపరిచాడు. జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్, వండర్ బుక్ ఆఫ్ రికార్డులను సొంతం చేసుకున్నాడు. శాటిలైట్స్, ఏలియన్స్, ఖగోళ సంబంధిత ప్రశ్నలకు టక్కున సమాధానాలు ఇచ్చాడు. గతంలో ఇలాంటి ఎన్నో రికార్డులను నెలకొల్పిన ఘనత చిన్నారిది. కార్యక్రమంలో జెసిఐ నెల్లూరు టౌన్ ప్రెసిడెంట్ పి.సాయి, చైర్‌పర్సన్ సంయుక్త పాల్గొన్నారు.



బాలుడిని సన్మానిస్తున్న సభ్యులు

శిరీషకు అభినందన

ప్రజాశక్తి - కావలి

శ్రీసాయి జూనియర్ కళాశాల విద్యార్థిని చేవూరు శిరీష ఇటీవల బాల్ బ్యాడ్మింటన్ జాతీయస్థాయి పోటీల్లో 2వ స్థానం సాధించిన జట్టులో ప్రథమ బహుమతిని సాధించిన సందర్భంగా కళాశాల మైదానంలో ఆమెకు శనివారం అభినందన సభ నిర్వహించారు. ఈ సభకు కళాశాల డైరక్టర్ బత్తిన అయ్యలరెడ్డి అధ్యక్షత వహించారు. నెల్లూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు వై.మురళి కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు విజయ శంకర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి డి.ఫిలిప్, తిప్పారెడ్డి ఎదునందనరెడ్డి, కళాశాల పరిపాలనాధికారి సురేఖ, వ్యాయామ అధ్యా పకులు కె.తిరుపాలు పాల్గొని శిరీషను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ శ్రీసాయి కళాశాల నిర్వాహకులు అయ్యలరెడ్డి ఇలా క్రీడా పోటీల్లో గెలుపొందుతున్న విద్యార్థులకు అయ్యే అన్ని ఖర్చులను భరిస్తూ విద్యార్థులను గుర్తు పెట్టుకుని వారికి ఇలా ఫెలిసిటేషన్ జరిపి ంచడం అభినం దనీ యమన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో క్రీడా బ వ ా ు వ ం త ా ం ల ం సాధించిన వాలీబాల్ టీమ్ లోని కళాశాల విద్యార్థులనుఅభినందించి మొమెంటోలు అందజేశారు.



శిరీషను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

బహుమతులు అందజేత

ప్రజాశక్తి - కావలి

కావలి విట్స్ ఇంజనీరింగ్ కళాశాల టెన్నిస్ కోర్టుల్లో జనవరి 1న ప్రారంభమైన డి.ఆర్. మెమోరియల్ నేషనల్ సిరీస్ అండర్ 16 టెన్నిస్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. పలురాష్ట్రాలకు చెందిన టెన్నిస్ క్రీడాకారులు హోరాహోరీగా ఆడారు. బాలికల డబుల్స్ ఫైనల్స్‌లో శుక్రవారం రాత్రి తెలంగాణ రాష్ట్రానికి చెందిన సంస్కృతి దామెర, స్మృతి భాసిన్‌లు, ఎపికి చెందిన లక్ష్మిసాహితి రెడ్డి, జ్ఞానిత జట్టుపై 7-5, 6-3 స్కోరు తేడాతో గెలుపొందారు. బాలుర డబుల్స్ ఫైనల్స్‌లో తమిళనాడుకు చెందిన భూపతి శక్తివేల్, అనిరుధ్‌కుమార్‌ల జట్టు, కర్ణాటకు చెందిన అమర్ పతంగే, తమిళనాడుకు చెందిన పి.హితేష్‌ల జట్టుపై ఆడి 6-4, 6-3 స్కోరుతో విన్నర్స్‌గా గెలుపొందారు. శనివారం ఉదయం జరిగిన బాలుర సింగిల్స్ ఫైనల్స్‌లో భూపతి శక్తివేల్ తన సమీపప్రత్యర్థి మొహిత్ బండారేపై విజయం సాధించాడు. బాలికల సింగిల్స్‌లో ఎపి చెందిన లక్ష్మిసాహితి రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి చెందిన తన ప్రత్యర్థి సంస్కృతి దామెరపై ఘనవిజయం సాధించారు. విన్నర్స్‌కు, రన్నర్స్‌కు టెన్నిస్ కోర్టులోనే బహుమతి ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు మొమెంటోలు, నగదు బహుమతులు, కప్పులు అందజేశారు. కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, ప్రోగ్రాం డైరక్టర్ దొడ్ల లిఖిత్‌రెడ్డి, విశ్వోదయ బాలుర ఉన్నతపాఠశాల కరస్పాండెంట్ విజయశేఖర్‌రెడ్డి, సీనియర్ టెన్నిస్ క్రీడాకారులు డాక్టర్ సుధాకర్, అనుమోలుశెట్టి రామకృష్ణలు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల పి.డిలు డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ ఆర్.మాల్యాద్రి, మణికంఠ, ప్రఖ్యాత ప్రపంచ క్రీడాకారిణి కె.కోటేశ్వరమ్మ, టెన్నిస్ అభిమానులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న అతిథులు



బహుమతి అందజేస్తున్న ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి

నేడు 5కె రన్

ప్రజాశక్తి - నెల్లూరు అర్బన్

జన్మభూమి – మా ఊరు, ఫ్లెమింగో పక్షుల పండుగను పురస్కరించుకుని ఆదివారం ఉదయం 5కె రన్ నిర్వహిస్తున్నామని జెసి ఇంతియాజ్ ఎఎండి ఇంతియాజ్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు ఎబిఎం కాంపౌండ్ నుంచి బయలుదేరి ఎసి సుబ్బారెడ్డి స్టేడియంకు చేరుకుంటుందని తెలిపారు. అక్కడ సమావేశం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ రన్‌లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

టెట్ సన్నద్ధతకు ఉచిత కోచింగ్

ప్రజాశక్తి - నెల్లూరు అర్బన్

టీచర్స్ ఎలిజిబిలిటి టెస్ట్(టెట్) ప్రైవేట్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ ఇస్తామని ఆ అసోసియేషన్ అధ్యక్షుడు కె.వి.కె విశ్వమోహన్ శనివారం ప్రకటనలో తెలిపారు. నగరంలో విఆర్‌సి సెంటర్‌లోని శ్రీనివాస స్టడీ సర్కిల్‌లో ఈ ఉచిత శిక్షణ ఉంటుందని తెలిపారు. ఇప్పటికే మొదటి బ్యాచ్‌ను ప్రారంభించామని, నేటి నుంచి రెండో బ్యాచ్‌ను ప్రారంభిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ప్రయివేటు టీచర్స్, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9440873045, 9912090069 నెంబర్లకు సంప్రదించాలన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న సభ్యులు, రూప్‌కుమార్‌యాదవ్

మెకానిక్‌కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నెల్లూరు సిటీ

స్థానిక దర్గామిట్టలోని వెంకటేశ్వర మెకానిక్ వర్క్స్‌లో పనిచేస్తున్న కొత్తు వెంకటేశ్వర్లు ఇటీవల ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ సందర్భంగా ద్విచక్ర మెకానిక్ అసోసి యేషన్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ రూప్‌కుమార్ యాదవ్, వైసిపి నాయకులు ఉమామహేష్ లు శనివారం వెంకటే శ్వర్లును పరామర్శించారు. అనంతరం ఆ అసోసియేషన్ నాయకులు ఆయనకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో ఆ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎండి బక్రుద్దీన్, సెక్రటరీ అన్వర్‌బాషా, జాయింట్ సెక్రటరీ నజీర్ ఖాన్, జమీర్, బాచి కిరణ్ పాల్గొన్నారు.

84మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - నెల్లూరు అర్బన్

పోసాని కృష్ణమురళి ఛారిటబుల్ ట్రస్టు, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం కోవూరు పడు గుపాడులోని అరుంధతి ఎయి డెడ్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సెవెన్ హిల్స్ హాస్పిటల్ డాక్టర్ కె.కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు దంతాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ శిబిరంలో 84 మంది విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుంధతి, మురళీ మోహనరాజు, గుర్రంకొండ సర్దార్, ప్రభాకర్, పాల్గొన్నారు.



దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి
www.prajasakti.com
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం 7
జనవరి 2018

విడవలూరులో ఎర్రజెండా రెపరెపలు


పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న జక్కా


అమరవీరుల స్థూపం వద్ద జక్కా నివాళి


నివాళి అర్పిస్తున్న మధు, విఎస్ఆర్


నివాళి అర్పిస్తున్న జిల్లా కార్యదర్శి రాజగోపాల్


మహాసభలకు వస్తున్న ప్రతినిధులు


ప్రజాశక్తి బుక్‌స్టాల్‌ను పరిశీలిస్తున్న మధు



ర్యాలీకి తరలివస్తున్న నాయకులు, కార్యకర్తలు


సభకు వస్తున్న విఎస్ఆర్


పేర్లు నమోదు చేసుకుంటున్న ప్రతినిధులు


ర్యాలీని తిలకిస్తున్న చిన్నారులు


ర్యాలీలో ఓ భాగం


సంతాప తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న మూలి వెంగయ్య


డప్పు కళాకారుల విన్యాసం


మహాసభలకు తీసుకొస్తున్న తిరుపాలు జ్యోతి




భారీ ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు


చంద్ర, మధు మాటామంతి


బహిరంగసభలో అభివాదం చేస్తున్న నాయకులు

విడవలూరులో 23వ జిల్లా మహాసభలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ మహాసభలకు జిల్లా నలు మూలల నుంచి ప్రతినిధులు తరలివచ్చారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీకి ఆ పార్టీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. విడవలూరు వీధులు ఎరుపెక్కాయి. అరుణపతాకం రెపరెపలాడింది. కార్యకకర్తలు ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు.


కార్యదర్శి నివేదికను ప్రవేశపెడుతున్న రాజగోపాల్


మహాసభలకు హాజరైన ప్రతినిధులలో ఓ భాగం



ర్యాలీలో అగ్రనేతలు


రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు


ర్యాలీలో రెపరెపలాడుతున్న జెండాలు


తిరుపాలు జ్యోతి అందుకుంటున్న మధు, విఎస్ఆర్



మన్సూర్, మాలకొండారెడ్డి జ్యోతులు తీసుకొస్తున్న నాయకులు


డప్పు, కోలాటం కళాకారుల నృత్యాలు


అమరవీరులకు సంతాపం తెలుపుతున్న నాయకులు


నివాళి అర్పిస్తున్న అన్నపూర్ణమ్మ


ర్యాలీ అగ్రభాగాన నడుస్తున్న మధు, విఎస్ఆర్


ర్యాలీకి భారీగా తరలివచ్చిన మహిళలు



మహాసభ వేదికపై విబిఎస్, జక్కా, విఎస్ఆర్ మాటామంతి




మన్సూర్, మాలకొండారెడ్డి జ్యోతులను అందుకుంటున్న నాయకులు


డప్పు కళాకారుల నృత్యం




బద్దెపూడి శీనయ్య జ్యోతిని తీసుకొస్తున్న నాయకులు


విప్లవ గీతాలు ఆలపిస్తున్న ప్రజానాట్యమండలి కళాకారులు


పుచ్చలపల్లి సుందరయ్య జ్యోతిని అందుకుంటున్న మధు


బద్దెపూడి శీనయ్య, చలపతి, చెంచయ్య జ్యోతులు అందుకుంటున్న నాయకులు


ఆహ్వానసంఘం తరపున స్వాగతం పలుకుతున్న తుళ్లూరు గోపాల్

నేటి నుంచి పక్షుల పండుగ

ప్రజాశక్తి - సూళ్ళూరుపేట

సూళ్ళూరుపేట వేదికగా నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే ఫ్లెమింగో ఫెస్టివల్ నేపథ్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పర్యాటక, తెలుగుభాష, సాంస్కృతిక శాఖ మంత్రి భూమా అఖిల ప్రియ, పరిశ్రమలు ఫుడ్ ప్రాసెసింగ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజస్ శాఖ మంత్రి ఎం.అమర్‌నాథ్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ హాజరు కానున్నారు. జ్యోతి ప్రజ్వలనలతో ప్రారంభమై ఎగ్జిబిషన్, స్టాల్స్ ప్రారంభం, బెలూన్, లోగో ఆవిష్కరణ చేయనున్నారు. దీనికి సంబంధించి సూళ్ళూరుపేటతో పాటు అటకాని తిప్ప, నేటపట్టు, భీములవారి పాళెంలో సందడి నెలకొంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. పండుగ ఆదివారం ఉదయం కావడంతో ఏర్పాట్లు సిద్ధం చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. జన్మభూమి కార్యక్రమాన్ని ఫ్లెమింగో ఫెస్టివల్ సందర్భంగా సూళ్ళూరుపేట నియోజకవర్గంలోని తడ, దొరవారిసత్రం మండలాల్లో రద్దు చేశారు. జూనియర్ కళాశాల ఆవరణ పండుగ సందడి నెలకొంది. ఓపెన్ ఆడిటోరియాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. సాంస్కృతిక కార్యక్రమాలకు మరో వేదికను సిద్ధం చేశారు. కళాశాల ఆవరణమంతా విద్యుత్ దీపాలు, ఫ్లడ్ లైట్స్ ఏర్పాటు చేశారు. స్వాగత ద్వారాలు భవనాలపై లైటింగ్‌లు, పెయింటింగ్‌లు వేశారు. క్రీడా పోటీలు శనివారం నిర్వహించారు. వాలీబాల్, కోకో నిర్వహించగా కబడ్డీ పోటీలను ఆదివారం ఉదయం నిర్వహించనున్నారు. ఫ్లెమింగో ర్యాలీని ఈ రోజు ఉదయం ఆర్‌డిఒ శీనానాయక్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీని పురవీధుల్లో నిర్వహించారు. ఈ రాజకీయ నాయకులు చంద్రబాబు పర్యటనలో ఉండగా అధికారులు మాత్రం ఫ్లెమింగో ఏర్పాట్లలో హడావుడిగా ఉన్నారు. మైదానంలో 50 స్టాల్స్‌ను ఏర్పాటు చేయగా 21 స్టాల్స్ ప్రభుత్వానివి కాగా మిగిలినవి ప్రైవేట్‌కు కేటాయించారు. ఒక్కో స్టాల్‌కు రూ.2 వేలు చొప్పున రుసుం నిర్ణయించారు. నేటి నుంచి ప్రారంభ కార్యక్రమానికి సినీ హీరోయిన్ హన్సిక పాల్గొంటారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం శివారెడ్డి కామెడీ షో, యాంకర్ రష్మిజ, మ్యూజిక్ డైరెక్టర్ బృందంచే లైవ్ ఆర్కెస్ట్రా నిర్వహించనున్నారు. సోమవారం ఈ కార్యక్రమాల్లో భాగంగా హేమచంద్ర, శ్రావణి బార్గవిలచే లైవ్ ఆర్కెస్ట్రా, యాంకర్ శ్యామల, కామ్నజర్నలానిచే నృత్య ప్రదర్శన ఉంటుంది. జబర్దస్త్ రచ్చ రవిచే కామిడీ స్కిట్, మంగళవారం మ్యూజిక్ డైరెక్టర్ తమన్ చే లైవ్ ఆర్కెస్ట్రా, యాంకర్ శ్రీముఖి, అర్చనచే నృత్య ప్రదర్శన, జబర్దస్త్, కిరాక్ ఆర్‌పిలచే స్కిట్లు, ముగింపు కార్యక్రమం మంగళవారం ప్రత్యేక అతిథిగా తెలుగు హీరోయిన్ రెజీనాలు హాజరవుతారు.


సభా వేదిక ఇదే

కాపు నాయకుడి మృతి పలువురి సంతాపం

ప్రజాశక్తి-వెంకటగిరి



వెంకటగిరి కాపు పట్టణాధ్యక్షులు చీళ్ళ శంకర్‌దాస్ మృతి చెందడంతో పలు రాజకీయ పార్టీ నాయకులు, కాపు నేతలు ఆయన వ౦ృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. శనివారం తెల్లవారుజామున మృతిచెందిన విషయం తెలుసుకొని స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆయన నివాసానికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకర్‌దాస్ కాపుల సమస్యలపై తుదిశ్వాస విడిచే వరకు పని చేశారన్నారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో వెంకటగిరి రాజా సర్వజ్ఞకుమార యాచేంద్ర , జిల్లా పరిషత్ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఉన్నారు.


మాట్లాడుతున్న కురుగొండ్ల

ఎంఎల్‌ఎచే రేషన్‌కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-వెంకటగిరిరూరల్

స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చేతుల మీదుగా రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. 15వ వార్డు జరిగిన మాఊరు, జన్మభూమి కార్యకమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు పంపిణీ చేస్తామన్నారు. అర్హులైన పేదలందరికీ రాబోవు రోజుల్లో అందుతాయన్నారు.

రాబోవు ఎన్నికల్లో టిడిపికే ఓటు వేయాలని కోరారు. వార్డు కౌన్సిలర్లు, చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలను చంద్రబాబు కూర్చో బెట్టకుండా జన్మభూమి కార్యక్రమాలతో ప్రతి వీధికి తిప్పుతున్నారన్నారు. ఆనంతరం విద్యార్థులకు మెప్మాద్వారా 60మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దొంతు శారద, ఆ వార్డు కౌన్సిలర్ దొనెల మలీశ్వరి, టిడిపి ప్రచార కార్యదర్శి దొనెల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి ఎంతో ఉపయోగం

ప్రజాశక్తి-వెంకటగిరిరూరల్

అర్హులైన వారందరూ మాఊరు, జన్మభూమి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ నాగమణి తెలిపారు. శనివారం మండల పరిధిలోని కుర్జాగుంట, లాలాపేట, పెట్లూరు గ్రామాల్లో 5విడత జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన వారికి రేషన్‌కార్డులు, పింఛనులు మంజూరు కానీ వారు వెంటనే అర్జీలు పెట్టి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. పెట్లూరులో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో తహసిల్దార్ రాజ్‌కుమార్, లాలపేటలో డిప్యూటీ తహసిల్దార్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో మండల సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది, పంచాయితీ స్పెషల్ ఆఫీసర్లు, పంచాయితీ కార్యదర్శులు, విఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి సంగీతం, నృత్యం దోహదం

ప్రజాశక్తి - గూడూరు

మానసిక ఉల్లాసానికి సంగీతం, నృత్యం దోహద పడుతాయని ప్రముఖ వైద్యులు చెరుకూరు జనార్ధన్‌రెడ్డి అన్నారు. అటువంటి మన సంస్కృతిని మనం గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. గూడూరు పట్టణంలోని డిఎస్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం రోటరీ క్లబ్, ఇన్నర్‌వీల్‌క్లబ్‌లు సంయుక్తంగా రోటరీ కల్చరల్ ఫెస్ట్ 2018 పేరుతో వినోదిని కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమం ప్రారంభ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అన్ని దేశాలు మన సంస్కృతిని గౌరవిస్తుంటే మనం మాత్రం ఇతర దేశాల సంస్కృతి మోజులో ఉంటున్నామన్నారు. మన సంసకృతి, సాంప్రదాయాలు ఎంతో గొప్పవన్నారు. డాక్టర్ చెరుకూరు రోహిణి మాట్లాడుతూ ఒత్తిడితో కూడిన విద్యతో ఎన్నో జీవితాలు అర్ధాంతరంగా ముగిసి పోతున్నాయన్నారు. విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకుని వారిని ఆయా రంగాల్లో ప్రోత్సహిస్తే ఇటువంటి ఆత్మహత్యలు ఉండవని వివరించారు. 2018- 19 రోటరీ గవర్నర్ కొణిదల మునిగిరిష్ మాట్లాడుతూ చదువుతో పాటు సాస్కృతిక కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ అవసరం అన్నారు. విద్యార్థులను ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. కార్యరకమంలో రోటరీ అధ్యక్షుడు పసుపులేటి మునిరాజా, రోటరీ కార్యదర్శి బాలకృష్ణం రాజు, ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభారెడ్డి, విష్ణువందన, సీనియర్ రొటేరియన్‌లు బి. దశరధరామిరెడ్డి, పి. జానికిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మన దేశ సంసకృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు నృత్య, పాటల పోటీల్లో పాల్గొన్నారు. లిటిల్ ఎంజిల్స్ పబ్లిక్, ప్రాస్‌పరో ఇంగ్లీష్ మీడియం,. విఎస్ఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు స్పాన్సర్స్‌గా వ్యవహరించాయి.


జ్యోతి వెలిగిస్తున్న డాక్టర్ జనార్ధన్‌రెడ్డి

ప్రముఖ వైద్యుడు చెరుకూరు జనార్ధన్‌రెడ్డి

అర్హులైన వారందరికీ పింఛన్లు


మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ రామకృష్ణ

ప్రజాశక్తి-వెంకటగిరి

అర్హులైన వారందరికీ సామాజిక పింఛన్లు ఈ విడతలో మంజూరు చేస్తానని స్థానిక ఎంఎల్‌ఎ కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. శనివారం జరిగిన మాఊరు, జన్మభూమి కార్యక్రమంలో 13, 14, 15 వార్డుల్లో జరిగింది. చైర్‌పర్సన్ దొంతు శారద ప్రాతినిధ్యం వహిస్తున్న 14వ వార్డులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వార్డు ప్రజలు ఎంతో అదృష్టవంతులను పేర్కొన్నారు. మున్సిపాలిటి చైర్‌పర్సన్ ఈ వార్డు నుండి గెలుపొందడంతో సంక్షేమ ఫలాలు మొదటి ఈ ప్రాంత ప్రజలకు త్వరగా దక్కుతున్నాయన్నారు. మండలాలను పక్కన పెట్టి మున్సిపాలిటిలో అర్హులైన వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఈ విడతలో తప్పకుండా పింఛన్లు పెడతానని హామీ ఇచ్చారు. చైర్‌పర్సన్ పదే పదే పింఛన్లు మంజూరు చేయాలని పలు ధపాలుగా కోరారని తెలిపారు. ఆమె మాటకు విలువనిచ్చి వెంటనే పింఛన్లు మంజూరు చేసే విధంగా ఆదేశాలు జారీ చేశామన్నారు. ఆనంతరం చైర్‌పర్సన్ దొంతు శారద మాట్లాడుతూ వెంకటగిరి సమగ్ర అభివృద్ధి చేసేందుకు ఎంఎల్‌ఎ కురుగొండ్ల రామకృష్ణ కట్టుబడి పని చేస్తున్నారన్నారు. రాబోవు ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరేంద్రకుమార్, మార్కెటింగ్ చైర్మన్ పులుకొల్లు రాజేశ్వరరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ బీరం రాజేశ్వరరావు, నాయకులు దొంతు బాలకృష్ణ, పార్టీ పట్టణా ధ్యక్షులు మంకు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యుఎఫ్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - వాకాడు

మోటార్ యాక్ట్ చట్టాన్ని రద్దు చేయాలని శనివారం స్థానిక ఆర్‌టిసి డిపో ఎదుట ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ బివి రమణయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మోటార్ యాక్ట్ చట్టాన్ని పార్లమెంట్‌లో తీర్మానం చేసిందన్నారు. ఆ తీర్మానాన్ని రాజ్యసభకు పంపామన్నారు. ఈ చట్టం ఆమోదిస్తే ఆర్టీసీ కార్మికులు తీవ్ర నష్టాలను ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. ఇక ప్రైవేట్ ఆధీనంలోకి వెళ్లిపోతుందన్నారు. వారు ఇష్టానుసారంగా వాహనాలను ప్రైవేట్ వారి ఆధీనంలోకి తెచ్చుకునే ప్రమాదం ఉందన్నారు. ధర్నాలో డిపో అధ్యక్షులు అనిల్, కార్యదర్శి జయరామయ్య. అలీమ్, సుబ్బయ్య, దస్తగిరి, అక్బర్, నాయుడు తదితరులు పాల్గొన్నారు

జన్మభూమి గ్రామసభలు

ప్రజాశక్తి - వాకాడు

మండలంలోని దుగ్గరాజపట్నం, తిరుమూరు పంచాయతీల్లో శనివారం జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. 5 వ విడత జన్మభూమిలో ప్రజా స్పందన పూర్తిగా కరువైంది. కార్యక్రమంలో మండల స్థాయిలోని వివిధ శాఖల అధికారులు పాల్గొంటున్నారు.

స్వర్ణముఖి నదికి నీరు విడుదల

ప్రజాశక్తి - నాయుడుపేటరూరల్

నాయుడుపేట మండల పరిధిలోని స్వర్ణముఖి నదికి 250 క్యూసెక్కుల నీరు కండలేరు జలాశయం నుంచి విడుదల చేసినట్లు మండల టిడిపి అధ్యక్షుడు కామిరెడ్డి రాజారెడ్డి తెలిపారు. నీటిని సమర్ధవంతంగా వినియోగించుకుని పంటలు పండించుకోవాలని రైతులను కోరారు.

లోకేష్ పర్యటనను జయప్రదం చేయండి

- నవ్యాంధ్ర రాజధాని నిర్మాణ సలహా కమిటీ సభ్యుడు బీద మస్తాన్‌రావు

ప్రజాశక్తి - కావలి

ఈ నెల 8న కావలిలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటించనున్నారని, నవ్యాంధ్ర రాజధాని సలహా కమిటీ సభ్యుడు బీద మస్తాన్ రావు తెలిపారు. శనివారం కావలిలో జరిగిన 22, 24, 26వార్డుల్లో జరిగిన జన్మభూమి సభలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మంత్రి లోకేష్ మద్దూరుపాడులో ప్రభుత్వం నిర్మించే అందరికి ఇళ్లు పథకంలోని భవన సముదాయాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. టిడిపి హయాంలో 10,010 పక్కాఇళ్లను మంజూరు చేయించామని తెలిపారు. ఉగాదికి కొత్తపింఛన్లు ఇప్పిస్తామన్నారు. పట్టణంలోని వీధుల్లో కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి సిమెంట్ రోడ్లు వేయించామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆయేషా బేగం, పాలడుగు అనూరాధ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు అమరావేదగిరి సుబ్బరాయుడు గుప్తా, జ్యోతిబాబురావు, ఆత్మకూరు బ్రహ్మయ్య, హాస్పిటల్ ఛైర్మన్ గుత్తికొండ కిషోర్‌బాబు,



మాట్లాడుతున్న బీద మస్తాన్‌రావు

ఎస్‌సిసెల్ అధ్యక్ష కార్యదర్శులు దావులూరి దేవకుమార్, వల్లేరి వెంకట కిరణ్‌కుమార్, టిడిపి నాయకులు పోతుగంటి శ్రీకాంత్, ఇబ్రహీం, పాలడుగు మురళి, జెట్టి శేషారెడ్డి, రవ్వా వెంకటసుబ్బారావు, తిరువీధి ప్రసాదు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వినోద్ నాయుడు

సమస్యల పరిష్కారానికే జన్మభూమి

ప్రజాశక్తి - జలదంకి

సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర జన్మభూమి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని మండల టిడిపి ఉపాధ్యక్షులు కంచర్ల వినోద్ నాయుడు తెలిపారు. శనివారం కేశవరం పంచాయతీలోని తిమ్మసముద్రం గ్రామంలో జన్మభూమి - మాఊరు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికి రేషన్‌కార్డులు, పింఛన్లు, పక్కాగృహాలు ప్రభుత్వం తరఫున మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం రేషన్‌కార్డులు, చంద్రన్నకానుకుల, రుణ మాఫీ పత్రాలను అందచేశారు. తహశీల్దారు రాంప్రసాద్, మాజీ మండల కన్వీనర్ చిట్టా బత్తిన మస్తాన్‌రెడ్డి, బ్రాహ్మణక్రాక మేజర్ బిట్-2 అధ్యక్షులు లింగంగుంట దశరథరామానాయుడు, మబ్బు ప్రసాద్, పట్నం మాల్యాద్రి, అన్నిశాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న డాక్టర్ అబ్దుల్ హఫీజ్

130 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - కావలి

స్థానిక తుఫాన్‌నగర్ శివాలయం రోడ్డు సెంటర్‌లో ఎస్ఎస్‌కె గ్లోబల్ డయాబెటిస్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత డయాబెటిక్, యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఉచితంగా 130 మందికి షుగర్, బి.పి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అబ్దుల్ హఫీజ్ మాట్లాడుతూ షుగర్ వ్యాధి పట్ల అప్రమత్తంగాఉండాలన్నారు. తేలికపాటి వ్యాయామాలు, ఆహార నియమాలు, ఆలోచన విధానం వంటివి పాటించడం వలన షుగర్‌ను అదుపులో ఉంచొచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - కలిగిరి

ఉదయగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి జిల్లాలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు బొల్లినేని వెంకట రామారావు అన్నారు. శనివారం కలిగిరి మండలంలోని కావలి ముస్తాపురం, నాగసముద్రం లో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటికే అభివృద్ధి పనులు రూ.1500ల కోట్లతో పనులు



మాట్లాడుతున్న ఎంఎల్ఎ బొల్లినేని రామారావు

చేపట్టామన్నారు. 2019 నాటికి సోమశిల ఉత్తరకాలువ నీరు మండలంలోని 7వేల ఎకరాలకు అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలో రూ.600కోట్లతో వెయ్యి పడకల ఆసుపత్రిని, వింజమూరు ప్రభుత్వ ఆసుపత్రిలో 50 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం రేషన్‌కార్డు, రుణ మాఫీ చెక్కులను ఆయన అందచేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద పాడు రామారావు, ఎంఆర్ఓ జనార్ధన్‌రావు, బిజ్జం కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు, మరియు ఎంపిటిసిలు, జెడ్‌పిటిసి కనిగిరయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి వైపు 'పెద్దపుట్టపుపాలెం'

ప్రజాశక్తి - కావలిరూరల్

ఫ్యాక్షన్ కోరల్లో చిక్కుకున్న పెద్దపట్టపుపాలెం గ్రామాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించిన నాయకులు నవ్యాంధ్ర రాజధాని నిర్మాణ సలహా కమిటి సభ్యులు బీద మస్తాన్‌రావేనని సర్పంచుల సంఘం అధ్యక్షులు నాగన్నగారి శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని పెద్దపట్టపుపాలెం, రుద్రకోట పంచాయతీల్లో జన్మభూమి, మాఊరు కార్యక్రమం జరిగింది. పెద్దపట్టపుపాలెం గ్రామంలో జరిగిన జన్మభూమి గ్రామసభలో స్థానిక సర్పంచ్ నాగన్నగారి శ్రీనివాసులు, మండలపార్టీ ప్రధానకార్యదర్శి ప్రళయకావేరి



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

భాస్కర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షురాలు పద్రిమహేశ్వరి, టిడిపి మండల కన్వీనర్ కోసూరి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో టిడిపిని కంచుకోటగా మార్చింది బీద మస్తాన్‌రావేనని కొనియాడారు. అనంతరం చంద్రన్న కానుకలు, గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. డిప్యూటీ తహశీల్దార్ సురేష్‌బాబు, హౌసింగ్ఎఇ ప్రసాద్, సర్వాయపాలెం వైద్యులు సురేష్‌బాబు,శ్రీకాంత్, పశువైద్యాధికారి, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశావలంటీర్లు, నాయకులు తిరుపతి పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి - జలదంకి

అర్హులైన వారందరికి వివక్ష లేకుండా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలని కమ్మవారిపాలెం సర్పంచ్ తమ్మినేని వరమ్మ కోరారు. శనివారం మండలంలోని కమ్మవారిపాలెంలో జరిగిన జన్మభూమి - మాఊరు గ్రామసభలో ఆమె పాల్గొని ప్రసంగించారు. తరచూ జన్మభూమి కార్యక్రమాలు నిర్వహించడం, అర్జీలు స్వీకరించడం, వాటి సమస్యలు పరిష్కరిం చకపోవడం పరిపాటిగా మారిందన్నారు. అర్హులందరికి రేషన్‌కార్డులు, పెన్షన్లు, పక్కా గృహాలు అందజేయాలని అధికారులను కోరారు. కార్యక్ర మంలో జలదంకి ఎంపిడిఒ రవీంద్రబాబు, టిడిపి నాయకులు అప్పలనాయుడు, పచ్చా పెంచల నాయుడు, వైసిపి నాయకులు తమ్మినేని సతీష్ పాల్గొ న్నారు.

పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - కావలి

స్థానిక ముసునూరు గిరిజనబాలికల గురుకుల పాఠశాలలో గిరిజన విద్యార్థులకు శనివారం ఇంగ్లీషు గ్రామర్ పుస్తకాలను, స్టేషనరీ సామగ్రిని అందజేశారు. విశ్రాంత పంచాయతీ విస్తరణాధికారి అళహరి వెంకట శేషయ్య జన్మదినం సందర్భంగా పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో



పుస్తకాలు అందిజేస్తున్న అతిథులు

జిల్లా సహాయ గిరిజన సంక్షేమాధికారి కె.అంకయ్య, జిల్లా ఎస్.సి., ఎస్.టి, విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు యం.మాలకొండారెడ్డి, దాత అళహరి వెంకట శేషయ్య, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు నక్కా సాయిరాంప్రసాద్, నక్కా కుమార్, పాఠశాల ప్రిన్సిపల్ పార్వతి, వసతి గృహ సంక్షేమాధికారి మహేష్ సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నకిలీ బిల్లులతో రూ.లక్షలు స్వాహా

ప్రజాశక్తి - కావలి

రూరల్ మండలంలో రూరల్ విద్యుత్ అధికారి అవినీతికి అంతులేకుండా పోతుంది. బాధితులైన విద్యుత్ వినియోగదారులు విమర్శిస్తున్నారు. టర్న్-కీ వర్క్‌లు చేస్తూ, నకిలీ బిల్లులు పెట్టి, ఎం.అండ్.పి డి.ఇ.చెక్ మెజర్‌మెంట్ లేకుండానే, డిపార్టు మెంట్ వర్క్‌లకు సంబంధించిన కండక్టర్, స్తంభాలు, మెటీరియల్‌ను టర్న్-కీ పనుల దారులకు తక్కువ ధరకు అమ్మేశాడు. వారికి పనులు చేసిపెడుతున్న రూరల్ విద్యుత్ అధికారి నిబంధనలు పాటించడంలేదు. నిబంధనలను పాటించాలని చెప్పాల్సిన డివిజన్ స్థాయి ఒ.అండ్.ఎం.అధికారులు ఈపనులలో వచ్చిన ఆదాయంలో తమకు ఎంత రావాలో గ్రహించి, అవినీతి అధికారి లీలలను సమర్థిస్తున్నారని విమర్శలు వినవస్తున్నాయి. మండలంలోని "ముందర పొట్టెమ్మ దేవస్థానం దగ్గర నుండి, తాళ్లపాళెం మజరా కోటడవి వరకూ" 125 స్తంభాలు(పోల్స్) నాటించి, కండక్టర్ బిగించి, మెటీరియల్ వాడారు. ఈ పనికి దాదాపు 61.4కి.మీ కండక్టర్ (హెచ్‌టి లైనుకు వాడే అల్యూమినియం వైర్)ను వాడినట్లు తెలియవచ్చింది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి, ఇలాంటి అవినీతి వర్క్‌లను పరిశీలించాలి. స్టోరు ద్వారా ఇచ్చే మెటీరియల్‌ను నిలుపుదల చేసిప్రారంభించిన వర్క్‌లను పరిశీలించి,వర్క్ ఆర్డర్లను క్లోజ్ చేయించాల్సి ఉంది. అలాచేస్తే, ప్రభుత్వ ఖజానాను కాపాడవచ్చునని పలువురు కోరుతున్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - కావలిరూరల్

ప్రభుత్వం గిరిజన సంక్షేమంకోసం ప్రవేశపెట్టిన పథకాలు అర్హులైన చల్లా యానాదులకు అందకుండా పక్కదోవ డుతున్నాయని అమ్మ ఆదరణ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షులు నున్నా మురళి అన్నారు. శనివారం మండలంలోని చెన్నాయపాలెం గిరిజన కాలనీలో చల్లా యానా దులకు దుప్పట్లు పంపిణీ చేశారు. హైకోర్టు న్యాయవాది మువ్వల వెంకటనారాయణ తల్లిదండ్రులు మువ్వల సీతమ్మ, సుందరం నాయుడు జ్ఞాపకార్థం ఈ సేవకార్యక్రమం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పసుపులేటి హరిప్రసాద్, ఎం.నటరాజ్‌పిళ్లే, సామాజిక కార్యకర్త కుంతూరు శ్రీనివాసులు, ఎస్ బాబూరావు, కాలనీపెద్దలు నంబూరు చెంచయ్య, అనపల్లి సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న నున్న మురళి

బీద అండతో ప్రజలకు లబ్ధి

ప్రజాశక్తి - కావలి

రాజధాని నిర్మాణ సలహా కమిటి సభ్యులు బీద మస్తాన్‌రావు అండతో 28 వార్డు ప్రజలకు ప్రభుత్వ పథకాల అందిస్తున్నామని ఆ వార్డు కౌన్సిలర్ నున్నా మృదుల, ఆమె భర్త మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులునున్నా వెంకట్రావులు పేర్కొన్నారు. శనివారం స్థానిక 28వ వార్డులో జన్మభూమి - మాఊరు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వార్డు ప్రజలకు నూతన రేషన్ కార్డులు, చంద్రన్న సంక్రాంతి కానుకలు,చంద్రన్న బీమాకార్డులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమానికి టీం లీడర్‌గా మున్సిపల్ మేనేజర్ ఎస్‌విఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



చంద్రన్న కానుకను అందిస్తున్న నున్నా దంపతులు



జాతీయస్థాయి సైన్స్ ఫేర్‌కు పొదలకూరు ఉపాధ్యాయుడి ఎంపిక

ప్రజాశక్తి-పొదలకూరు

నెల్లూరులో 3 నుంచి 5వ తేదీ వరకూ రాష్ట్ర స్థాయిలో జరిగిన జవహర్‌లాల్ నెహ్రూ సైన్స్ ఎగ్జిబిషన్‌లో పొదలకూరు డిఎన్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎ.వి.సుధాకర్ జాతీయ స్థాయి సైన్స్ ఫేర్‌కు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం జాహిద్ జూలియా పేర్కొన్నారు.జాతీయస్థాయికి ఎంపికైన ఉపాధ్యాయుడు సుధాకర్‌ను ఆ పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల్లూరులో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు సుధాకర్ తక్కువ ఖర్చుతో ప్లాస్టిక్‌వాడకాన్ని తగ్గిస్తూ రూపొందించిన మినీ రసాయన శాస్త్ర ప్రయోగశాల కిట్, ప్రయోగశాలలు లేని చోట కూడా సైన్స్ పరికరాలతో ప్రయోగాలు చేసుకునే విధంగా ఏర్పాటు చేసిన నమూనాలు పలువురి మన్ననలు పొందాయని దీంతో ఆ ఉపాధ్యాయుడ్ని జాతీయస్థాయికి ఎంపిక చేశారు. నెల్లూరు జిల్లా నుంచి జాతీయ స్థాయికి పంపేందుకు ఎంపికైనట్లు తెలిపారు. నాలుగు ప్రాజెక్టులు ఎంపిక కాగా అందులో సుధాకర్‌కు ఉపాధ్యాయ ప్రదర్శనలో ఎంపికైందని, సుధాకర్‌కు మునిసిపల్ మంత్రి నారాయణ, డిఇఓ శామ్యూల్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, మెమోంటోలను సుధాకర్ అందుకున్నారని తెలిపారు. ఈనెల ఎనిమిది నుంచి హైదరాబాదులో జరిగే సైన్స్ ఫేర్‌లో ఉపాధ్యాయుడు పాల్గొంటారని తెలిపారు. జాతీయ స్థాయి సైన్స్ ఫేర్‌కు ఎంపికైన సుధాకర్‌ను ఎంఇఓ బాలకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

పాఠశాలకు బీరువా వితరణ

ప్రజాశక్తి-సీతారామపురం

బడికి రుణం తీర్చుకుందాం కార్యక్రమం సందర్భంగా అయ్యవారిపల్లి ప్రాథమిక పాఠశాలకు ఆ గ్రామానికి చెందిన మాజీ సర్పంచి, టిడిపి నాయకుడు పిండిబోయిన రమణయ్య ఆ పాఠశాలకు బీరువాను వితరణగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ అంతో ఇంతో రుణం తీర్చుకోవాలని తెలిపారు.

అందరికీ ప్రభుత్వ ఫలాలు

ప్రజాశక్తి-సీతారామపురం

ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ఫలాలు అందరికీ అందేలా చర్యలు చేపడుతున్నట్లు తహశీల్దారు, ఎంపిడిఓలు తెలిపారు. జన్మభూమి-మాఊరు కార్యక్రమం సందర్భంగా అయ్యవారిపల్లిలో శనివారం జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చర్యలు చేపడుతున్నామని తహసీల్దారు కోటేశ్వరరావు, ఎంపిడిఓ కిరణ్‌కుమార్‌లు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీలు, రేషన్‌కార్డులు, ఇతర సమస్యలపై ఆ గ్రామ ప్రజలు 35 అర్జీలను అందజేశారు. ఈకార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వైద్యశాలకు రోగి తరలింపు

ప్రజాశక్తి-పొదలకూరు

నా అనే వారు లేక అనారోగ్యంతో దిక్కు లేక పడి ఉన్న ఓ అభాగ్యుడ్ని ఎస్ఐ చొరవతో వైద్యశాలకు తరలించిన ఉదంతం పొదలకూరు పంచాయతీ బస్టాండులో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలమేరకు.. ఎక్కడి నుంచో వచ్చిన ఒక అనాథ రెండు రోజులుగా బస్టాండులో చలికి వణుకుతూ అనారోగ్యంతో కొట్టుమిట్టాడుతూ పడి ఉన్నారు. అనాథ గురించి ఎవరూ పట్టించుకోలేదు. ఓ వ్యక్తి శనివారం సాయంత్రం గమనించి 108కు ఫోన్ చేశారు. ఇక్కడకు వచ్చి అంబులెన్స్ సిబ్బంది అటెండర్ ఎవరూ లేకుండా తాము తీసుకెళ్లమంటూ మొండికేశారు. దీంతో ఆ వ్యక్తి ఎస్ఐకు ఫోన్ చేశారు. చలిగాలులకు అనారోగ్యంతో మృతి చెందకుండా ఎస్ఐ జగత్‌సింగ్ కాపాడారు.

పలుచోట్ల 'జన్మభూమి- మా ఊరు'

ప్రజాశక్తి-పొదలకూరు

మండలంలోని డేగపూడి, మొగళ్లూరు, తోడేరు, వామిటపర్తి గ్రామాల్లో శనివారం జన్మభూమి-మాఊరు కార్యక్రమం జరిగింది. డేగపూడి కార్యక్రమానికి తహసీల్దారు అన్నదాత నిర్మలానందబాబా, మొగళ్లూరు కార్యక్రమంలో ఎంపిడిఓ నాగేంద్రబాబు, తోడేరు గ్రామంలో నిర్వహించిన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో ఇఓపిఆర్‌డి నారాయణరెడ్డి, వామిటపర్తిలో డిటి పవన్‌కుమార్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా డేగపూడిలో తహసీల్దారు అన్నదాత నిర్మలానందబాబా మాట్లాడుతూ అయిదో విడత జన్మభూమి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఫించన్ల లబ్ధిదార్లను ఎంపిక చేశారు. కొత్త రేషన్‌కార్డులు, చంద్రన్న కానుకల్ని పంపిణీ చేశారు. మొగళ్లూరులో ఎంపిడిఓ నాగేంద్రబాబు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి జన్మభూమిలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లను తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. తోడేరు గ్రామంలో ఇఓ పిఆర్‌డి నారాయణరెడ్డి మాట్లాడుతూ జన్మభూమి



పొదలకూరులో జన్మభూమి కార్యక్రమం

కార్యక్రమాలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. వామిటపర్తిలో డిటి పవన్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ మండల శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్

మండలంలోని మురగళ్ల, దేపూరు, నారంపేట గ్రామాల్లో శనివారం జన్మభూమి-మా ఊరు కార్యక్రమం జరిగింది. నారంపేటలో సర్పంచి కంచర్ల సునీత అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎంఎల్ఎ కంచర్ల శ్రీహరినాయుడు పాల్గొనగా ప్రత్యేకాధికారి, జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి రవిశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు మరియు ప్రజలకు ప్రభుత్వం దగ్గరకు వెళ్లేందుకు జన్మభూమి కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. అదేవిధంగా మురగళ్ల గ్రామంలో జన్మభూమి-మాఊరు కార్యక్రమానికి సర్పంచి తుమ్మలపూడి సునీత అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా టిడిపి నాయకులు పచ్చా వెంగయ్యనాయుడు పాల్గొన్నారు. ప్రత్యేకాధికారిగా ఎంపిడిఓ శ్రీనివాసరావు, గ్రామ ప్రత్యేకాధికారి వెంకటరావు, ఎంపిటిసి సభ్యులు దావినేని నరసింహులు, జలవనరుల శాఖ ఎఇ రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు. దేపూరు గ్రామంలో సర్పంచి మల్లిక చినలక్ష్మయ్య అధ్యక్షతన జన్మభూమి-మా ఊరు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాల్లో అధికారులు, నాయకులు పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో వ్యవసాయాధికారి ఎస్ ప్రసాద్, గణాంకాధికారి శ్రీనివాసరావు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి

మండలంలోని పుల్లాయపల్లి, గన్నేపల్లి గ్రామాల్లో శనివారం జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. గన్నేపల్లి పంచాయతీలోని మిట్టపల్లి గ్రామంలో తహసీల్దారు వెంకటసునీల్ సభను నిర్వహించి అనంతరం జన్మభూమి-మా ఊరును ఉద్దేశించి ప్రజలకు అవగాహన కల్పించి అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎక్కువ మంది ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంటు పనితీరు బాగా లేదని, పనులు కల్పించడం లేదని వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు వినతిపత్రం అందించారు. అనంతరం గ్రామంలోని ఉపాధి కార్డులు, పెన్షన్ కార్డులు, చంద్రన్న కానుకల్ని సర్పంచి పద్మావతి, సొసైటీ అధ్యక్షులు గడ్డం వెంకటేశ్వర్లు తదితరులు అందజేశారు.కార్యక్రమంలో ఎపిఎం కాంతారావు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యుఎఫ్ ధర్నా

ప్రజాశక్తి-ఆత్మకూరు

మోటారు వెహికల్ యాక్ట్ చట్ట సవరణకు వ్యతిరేకంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆత్మకూరు ఆర్‌టిసి డిపో ఎదుట స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నానుద్దేశించి స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ డిపో కార్యదర్శి మహమ్మదాలి మాట్లాడుతూ మోటార్ వెహికల్ చట్ట సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం రాజ్య సభలో ఆమోదించినందుకు పెట్టనున్నారని ఈ బిల్లు చట్ట రూపం దాలిస్తే దేశంలోని ప్రభుత్వ రంగ



ధర్నా చేస్తున్న కార్మికులు

రవాణా సంస్థలు కనుమరుగు అవుతాయన్నారు. బహిరంగ టెండర్ల ద్వారా ఆర్‌టిసికి రూట్లు దక్కకపోతే ఆయా రూట్లను ప్రైవేటు ఆపరేటర్లు కైవసం చేసుకుంటారు. ఇప్పుడున్న టూరిస్టు పర్మిట్లు, ఆన్‌కాంటాక్టు పర్మిట్ల స్థానంలో క్యారియర్‌గా ప్రైవేటు వారికి అవకాశం ఏర్పడి ఆర్‌టిసికి కష్టకాలం ఏర్పడినట్లు తెలిపారు. డ్రైవర్లకు పొరపాటున జరిగిన యాక్సిడెంట్లలో భారీ ఎత్తున శిక్షలు అమలు చేసే సవరణ కూడా మోటారు వెహికల్ యాక్ట్‌లో ఉందన్నారు. దీనివల్ల డ్రైవర్లు చిన్న కేసుల్లో భారీ జరిమానాలు, శిక్షలు వేసే ప్రతిపాదనలు ఈ మోటారు వెహికల్ యాక్ట్‌లో ఉన్నాయన్నారు. కావున ఈ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎస్‌డబ్లుఎఫ్ కార్మిక నాయకులు పఠాన్ హయత్‌బాషా, పెంచలరావు, ఎస్.కె.మస్తాన్, ఎన్.హజరత్తయ్య, పెంచలయ్య, యు.శ్రీనివాసులు, జి.వెంకటరావు, రాజు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్‌వైపు పరుగులు

ఆత్మకూరు:స్వచ్ఛ సర్వేక్షన్ 2018 ఇండిపెండెంట్ వాలిడేషన్‌లో రాష్ట్రంలో మూడో గ్రేడ్ మునిసిపాలిటీల్లో మొదటి స్థానం సాధించింది. శనివారం ర్యాంకింగ్ విడుదల చేశారు. ఇందులో భాగంగా రాష్ట్రం మొత్తంపై కలిపి ఆత్మకూరు పదో స్థానంలో ఉంది. జిల్లాలో మొదటి స్థానం కైవసం చేసుకుంది. మూడో గ్రేడ్ మునిసిపాలిటీల్లో మొదటి స్థానం కైవసం చేసుకుందని ఆత్మకూరు మునిసిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్వచ్ఛ సర్వేక్షన్ 2018లో ర్యాంకింగ్ సాధించేందుకు కృషి చేశారు.ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సిఎం సభకు తరలిన ప్రయివేటు వ్యాన్లు

అవస్థల్లో విద్యార్థులు

ప్రజాశక్తి-ఆత్మకూరు

పట్టణ పరిధిలోని కోడూరుపాడులో నిర్వహించిన జన్మభూమి-మాఊరు కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనలో భాగంగా ఆత్మకూరు నుంచి వివిధ ప్రయివేటు పాఠశాలల బస్సుల్లో జన సమీకరణ చేశారు. పేదలకు పట్టాలిస్తామని మునిసిపాలిటీ సిబ్బంది తరపున ఈ కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమానికి ఆత్మకూరు నుంచి సుమారు 600 మంది బయల్దేరారు. మహా అంటే ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఒకరిద్దరికి కూడా ఆత్మకూరుకు చెందిన వారికి పట్టాలు ఇవ్వలేదు. ఈ విషయం అందరికీ తెలిసిన విషయమే. ఈ సంగతి ముందుగా తెలిసినా ముందుగా చెప్పకుండా జన సమీకరణ కోసం ఇలా చెప్పారని విమర్శలు వినిపిస్తున్నారు. ఇంతవరకు ఓ రకమైన విమర్శలు వస్తే, ఇలా తరలించినందుకు గాను ప్రైవేటు స్కూళ్లకు చెందిన వ్యాన్లను వినియోగించారు. ఇందుకోసం ఆత్మకూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌చే ఒత్తిడి చేయించి ఖచ్చితంగా ఒక్కో స్కూల్ నుంచి ఒక్కో వ్యాన్ పెట్టాలని చెప్పి పెట్టించారు. తద్వారా ప్రైవేటు విద్యాసంస్థల వారు తప్పనిసరి అన్నట్లు ఒక వాహనం చొప్పున పంపారు. అనంతరం ఈ వాహనాల్ని ఆత్మకూరు మునిసిపల్ కార్యాలయానికి తరలించారు. అక్కడినుంచి ఆర్‌డిఒ బాపిరెడ్డి, తహసీల్దారు సుబ్బయ్య, కమిషనర్ శ్రీనివాసరావులు పట్టాల పంపిణీ కోసమే జనాల తరలింపునకు ప్రణాళిక రూపొందించారు. తీరా సిఎం సభకు వెళ్లాక అక్కడ ఒక్కరికి కూడా పట్టాల పంపిణీ చేయలేదనే విమర్శలు వచ్చాయి. ముఖ్యమంత్రి, మంత్రులు, కలెక్టరు అందరూ వెళ్లిపోగానే జాయింట్ కలెక్టరు చేతుల మీదుగా ఈ పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని కొందరికి చేపట్టారు. ఇదిలా ఉంచితే ప్రైవేటు స్కూలు యాజమాన్యాలు ఉదయం ఏడు గంటలకే స్కూలు వ్యాన్లు పెట్టాలనే ఆంక్షతో అనేక ఇబ్బందులు పడుతూ విద్యార్థులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. దీంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సాయంత్రం ఇంటికి వెళ్లే సమయంలో కూడా ఇబ్బందులు పడ్డారు. సాధారణంగా ఇటువంటి సభలకు జన సమీకరణ చేయాలంటే ఆర్‌టిసి బస్సుల్ని వాడుకుంటారు. ఈసారి మాత్రం ప్రైవేటు స్కూళ్ల వాహనాల్లో తరలించడం విశేషం. ఈ వాహనాలకు ఇంధనం ఖర్చు మునిసిపాలిటీ భరించింది. ఆశగా వెళ్లిన ప్రజలు అసంతృప్తిగా తిరిగి వచ్చారు.

ప్రజాశక్తి
11
ఆదివారం 7 జనవరి 2018

జన్మభూమి సభలు

ప్రజాశక్తి - కోట : కోట మండలం వెంకన్నపాళెంలో శనివారం జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో చంద్రన్న కానుకలు పంపిణీ చేశారు. వెంకన్నపాళెంలో తహసీల్దార్ కోసూరు రాజ్యలక్ష్మీ ఆధ్వర్యంలో చంద్రన్న కానుకలు, బాలింతలకు పౌష్టికాహారం అందించారు. వైద్య సిబ్బంది వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షుడు పోకర్ల మధుయాదవ్, గూడలి సర్పంచ్ గౌరవబత్తిన శారద, మాజీ ఎంపిపి గౌరవబత్తిన సోమశేఖర్‌రావు, ఆర్ఐ వేణుగోపాల్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ భావనారాయణ, ఆరోగ్యమిత్రలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాయుడుపేటటౌన్: నాయుడు పేట పట్టణంలోని ఎల్ఎ సాగరంలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎఎంసి ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి మహిళ ఆర్థికాభివృద్ధికి వడ్డీలేని రుణాలు పొదుపు గ్రూపులకు 10 లక్షల వరకు ఇస్తున్నారన్నారు. ఈ క్రమంలో శనివారం ఓ పొదుపు గ్రూపునకు 3,60 లక్షలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మైలారి శోభారాణి, ఇన్‌ఛార్జి కమిషనర్ ఉమామహేశ్వర్‌రావ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

నాయుడుపేట రూరల్ :

నాయుడుపేట మండలం పార్లపల్లి, జువ్వలపాళెం గ్రామాల్లో శనివారం జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కామిరెడ్డి రాజారెడ్డి పాల్గొని పంచాయతీ పరిధిలోని సిమెంట్‌రోడ్లు, గ్రావెల్ రోడ్లు మంజూరైనట్లు తెలిపారు. పేద ప్రజలకు అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శివయ్య, తహసీల్దార్ మైత్రేయతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఎన్‌డిసిసిబి డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, ఎంపిపి తుపాకుల కన్నెమ్మ, ప్రజలు పాల్గొన్నారు.



నాయుడుపేటలో చెక్కులు ఇస్తున్న అధికారులు

సమస్యలు పరిష్కరించకుంటే చర్యలు : ఆర్‌డిఒ



మాట్లాడుతున్న ఆర్‌డిఒ

ప్రజాశక్తి - సైదాపురం

ప్రజలు ఇచ్చిన అర్జీలపై సమస్యలు పరిష్కరించకుంటే చర్యలు తప్పవని గూడూరు ఆర్‌డిఒ పి. అరుణ్‌బాబు హెచ్చరించారు. సైదాపురం మండలంలో తిప్పిరెడ్డిపల్లి, జోగిపల్లి, గులించెర్ల, గ్రామాలలో అధికారులు జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం చీకవోలులో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జన్మభూమి కార్యక్రమం అయ్యే వరకు అధికారులు గ్రామాల్లో ఉండాలని ఎన్‌టిఆర్ గృహాలు, మరుగుదొడ్ల బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం వివిధ శాఖల అధికారులను చేస్తున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహారాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం స్వయం సహాయక సంఘాలకు పావలా వడ్డీలు పంపిణీ చేశారు. పేద ప్రజలకు సంక్రాంతి కానుకలు అందించారు. మహిళలకు ముగ్గుల పోటీలు, విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు.

పింఛన్ కోసమొచ్చి సొమ్మసిల్లిన వృద్ధురాలు

పింఛన్ కోసం వచ్చిన వృద్ధురాలు మహబూబి సొమ్మసిల్లి పడిపోయింది. అక్కడే ఉన్న వైద్యాధికారి పాల్ జాన్సన్ ఆమెకు వైద్య సేవలందించారు. జన్మభూమిలో పింఛన్లు పంపిణీ చేస్తామని పంచాయతీ కార్యదర్శి చెప్పారని, దాంతో ఆమె వచ్చిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ మునిలక్ష్మీ, ఎంపిడిఓ స్వరూపారాణి, పంచాయతీరాజ్ ఎఇ చంద్రశేఖర్, వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య, ఎపిఒ పూర్ణిమ, ఎపిఎం చిన్నయ్య, ఎంఇఒ నందకుమార్, చీకవోలు సర్పంచ్ సజ్జారి రమణయ్య, జోగిపల్లి సర్పంచ్ కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను పెంచుకుంటే అభివృద్ధి

మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి - గూడూరు

నాయకత్వ లక్షణాలను మనకు మనమే పెంపొందించుకోవాలనీ, తద్వారా వ్యక్తిగతంగా ఎంతో అభివృద్ధి సాధించవచ్చన్నారు. గూడూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ అన్నారు. అటువంటి నాయకత్వ లక్షణాలు ఎవరో వచ్చి మనకు ఇవ్వరన్న విషయం గుర్తుంచుకోవాలని వివరించారు. గూడూరు పట్టణంలోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో వివేకానందుని యువజనోత్సవాలు నిర్వహించారు. ఈ క్రమంలోనే సంక్రాంతి సంబరాలను కూడా ఆ విద్యార్థి సంఘం నిర్వహించింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశానికి ఛైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ధర్మరాజస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ వాటంబేటి శివకుమార్ మాట్లాడుతూ చదువుల పోటీలో పడి మన దేశ సంస్కృతి సాంప్రదాయాలను విస్మరిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎబివిపి రాష్ట్ర కార్యదర్శి మల్లిఖార్జున్, డివిజన్ కార్యదర్శి మనోజ్‌కుమార్, నగరాధ్యక్షుడు దొరబాబు, సహ కార్యదర్శి చిన్నా, కోటయ్య, శశి తదితరులు పాల్గొన్నారు

పేదరికమే పథకాలకు అర్హత : పాశం

ప్రజాశక్తి - గూడూరురూరల్

పేదరికమే ప్రభుత్వ పథకాలకు అర్హత అని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సంక్షేమ పథకాల అమలులో పార్టీలను చూడబోమని ఆయన మరో మారు స్పష్టం చేశారు. గూడూరు రూరల్ మండలం పారిచెర్లవారిపాళెంలో శనివారం జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. పనిచేసిన తర్వాతే ఓటు అడుగుతానన్నారు. సిమెంట్లు రోడ్లు నిర్మాణానికి 10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న చిరంజీవి అనే వ్యక్తి వైద్య ఖర్చులకు సుమారు ఒక లక్ష ఎల్‌ఓసిని అందించారు. ఈ కార్యక్రమంలో జెట్పీటీసీ సభ్యురాలు బొమ్మిరెడ్డి పద్మ, మండల ఉపాధ్యక్షురాలు మట్టం శ్రావణి, నాయకులు నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు రాజు, పిట్టు నాగరాజు తదితరులు పాల్గొన్నారు,



బాధితురాలికి చెక్కును అందజేస్తున్న ఎంఎల్ఎ సునీల్

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న కమిషనర్

ప్రజాశక్తి - సూళ్ళూరుపేట

సూళ్ళూరుపేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు అమెరికాకు చెందిన కె.ప్రియతమ్ కుటుంబ సభ్యుల వితరణతో పుస్తకాలు పెన్నులు. జనరల్ నాలెడ్జ్ నోటు పుస్తకాలను అందించారు. లిటిల్ స్టార్స్, ఫీచర్ స్టార్స్ పేరుతో నిర్వహిస్తున్న స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను చైతన్య పరిచే క్రమంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్ బంగారు బాట ఎలా అన్న అంశాలతో పాటు మంచి మార్కులు సాధిస్తే పొందే ప్రయోజనాలను వివరించారు. పాఠశాలలో ప్రతిభ కనబరచాలని విద్యార్థులకు కొన్ని సూచనలు అందించారు.

ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ కమిషనర్ రాజగోపాల్‌రావ్, దాతల కుటుంబ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఫణివేణి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బాధితులకు నగదును అందజేస్తున్న ఛైర్‌పర్సన్, ఎంఎల్ఎ

టిడిపి సీనియర్ నాయకుడు మృతి

కుటుంబానికి ఎంఎల్ఎ, ఛైర్‌పర్సన్ల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-వెంకటగిరి

వెంకటగిరి మున్సిపాలిటి పరిధిలోని 8వ వార్డులో మృతిచెందిన టిడిపి సీనియర్ నాయకులు సామల క్రిష్ణయ్య కుటుంబానికి స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ దొంతు శారద ఆర్థిక సహాయం చేశారు. వారు శనివారం మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. ఆనంతరం ఆ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే 10వేల రూపాయలు, ఛైర్‌పర్సన్ 5వేల రూపాయలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిష్ణయ్య టిడిపి అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. పార్టీ కార్యకర్తలు మృతిచెందితే వారి కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈమె వెంట ఆవార్డు టిడిపి నాయకులు ఘట్టమనేని గోపి, 22వవార్డు కౌన్సిలర్ పునుగోటి విశ్వనాధం(మురగ), మహిళా టిడిపి పట్టణాధ్యక్షురాలు కామాక్షి, సాయితేజ తదితరులు పాల్గొని ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కమిషనర్

బాలుడిపై పందుల దాడి

ప్రజాశక్తి - నాయుడుపేట టౌన్

నాయుడుపేట పట్టణంలోని ఎఎల్‌సిఎం స్కూల్ గ్రౌండ్‌లో ఉన్న సంచార జాతుల పిల్లలపై బజారులో విచ్చలవిడిగా తిరుగుతున్న పందులు గుంపులుగా దాడి చేసి గాయపరిచాయి. గ్రౌండ్‌లో టెంట్లు వేసుకుని గ్రామాల్లోకెళ్ళి గాజులు, పూసలు గ్రామగ్రామాన తిరిగి అమ్ముకుని జీవనం సాగించే సంచార జాతుల వారు పిల్లలను వదిలి బయటకు వెళుతుంటారు. ఈ క్రమంలో ఉదయం వారు లేని సమయంలో ఈ ఘటన జరిగింది. విషయం తెలుసుకున్న కమిషనర్ ఉమామహేశ్వర్‌రావు బాలుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలందించారు. పట్టణంలో పందులు ఎక్కడా తిరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వం క్రీడల పట్ల శ్రద్ద చూపాలి

వెంకటాచలం: రాష్ట్ర ప్రభుత్వం క్రీడల పట్ల శ్రద్ధచూపాలని జిల్లా వైసిపి అధ్యక్షుడు, సర్వేపల్లి శాసనసభ్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు.వెంకటాచలంలో జడ్‌పిటిసి మందల వెంకటశేషయ్య ఆద్వర్యంలో నిర్వహిస్తున్న జెడ్‌పిటిసి క్రికెట్ టోర్నమెంట్స్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల పట్ల శ్రద్ధ చూపకుండా మొక్కుడిగా నిర్వహిస్తుందన్నారు.ఎవరైనా పథకాలు సాధిస్తే అది తన ప్రతిభగా చెప్పుకొనే సిఎం చంద్రబాబునాయుడు క్రీడలకు బడ్జెట్‌లొ నిదులు కేటాయంచడం లేదన్నారు. జెడ్‌పిటిసి టోర్నమెంట్స్‌ను ప్రతిఏటా నిర్వహించాలని టోర్నమెంట్స్ నిర్వహకులను అభినందించారు.కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు హుసేన్, మనుబోలు మాజీ జెడ్‌పిటిసి దాసరి భాస్కర్‌గౌడ్, మండల కన్వీనర్ చెంచుకృష్ణయ్య, నాయకులు కోదండరామిరెడ్డి, పోచారరెడ్డి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్‌గా చేస్తా : సిఎం

రూ.50 కోట్లతో విఎస్‌యు అభివృద్ధి యూనివర్శిటీ భవన సముదాయం ప్రారంభం

ప్రజాశక్తి - వెంకటాచలం

రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్‌గా తయారు చేయడమే తన లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. వెంకటాచలం మండలం కాకుటూరు వద్ద ఉన్న నూతన విక్రమ సింహపురి విశ్వ విద్యాలయలో రూ.26 కోట్లతో నిర్మంచిన భవన సముదాయాన్ని శనివారం సిఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో సిఎం మాట్లాడారు. జిల్లాలోని విద్యార్థులకు తెలివి తేటలకు కొదవ లేదన్నారు. ఈ గడ్డపై పుట్టిన వారు దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో ఉన్నారు. దానికి కారణం బ్రిటీషు కాలంలోనే పెన్నా సంగం బ్యారేజీ నిర్మంచినందున నీరు సమృద్ధిగా ఉందన్నారు. దాంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెంది నాగరికత పెరిగిందన్నారు. యూనివర్శిటీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్య భారం కాకూడదన్నారు. ఇష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చునని తెలిపారు. తాను కూడా ఏ పని చేసినా ఇష్టంగా చేస్తానని, అందుకే నాకు విసుగు ఉండదన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు, ఆధ్యాపకులు గమనించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన తరువాత విద్యార్థులే ఉపాధ్యాయులకు పాఠాలు చేప్పే స్థాయికి ఎదిగారన్నారు. ప్రతి విద్యార్థి పరిశోధన వేత్తగా తయారు కావాలని పిలుపునిచ్చారు. గతంలో కళాశాలలు తక్కువగా ఉండేవి తాను అధికారంలోకి వచ్చిన తరువాత ఎక్కువ కళాశాలలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ కనెక్షన్ దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎంతఖర్చు అయినా విఎస్‌యుని ఉత్తమ యూనివర్సిటిగా చేస్తానని తెలిపారు. అందుకు రూ.50 కోట్లు ఇచ్చేందుకు సిద్దంగా ఉన్నానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎంఎల్‌సి వాకాటి నారాయణరెడ్డి, మాజీ ఎంఎల్‌ఎ బల్లి దుర్గాప్రసాద్, డిసిసిబి ఛైర్మన్ ధనుంజయ్యరెడ్డి, రాజధాని కమిటీ సభ్యుడు బీద మస్తాన్‌రావు, జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు, విసి వీరయ్య, రిజిస్ట్రార్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


నూతన భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న సిఎం

ఆత్మకూరు అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-ఆత్మకూరు

మునిసిపాలిటీని అభివృద్ధిపథంలో ముందుంచేందుకు మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కృషి చేస్తున్నట్లు పట్టణ టిడిపి అధ్యక్షుడు సిహెచ్ ఆదిశేషయ్య తెలిపారు. శనివారం ఆత్మకూరులోని 16,17 వార్డులకు గాను టెక్కే ప్రాంతంలోని ఎంపిపి స్కూల్ ఆవరణలో జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో ఆత్మకూరు నియోజకవర్గాన్ని 20 సంవత్సరాల ముందుకు తీసుకెళ్లిన ఘనత ఆనం రామనారాయణరెడ్డి అని తెలిపారు. ఆత్మకూరు మునిసిపాలిటీ అభివృద్ధికి రూ. కోట్ల నిధులు వెచ్చించారని ఇప్పటిదాకా ఏ నాయకుడు చేయనంత అభివృద్ధిని ఆనం చేశారన్నారు.

తాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో రూ. 70 కోట్లతో తీర్చారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని వడ్డించారు. కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులు, చంద్రన్న కానుకలు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ రాగి వనమ్మ, వైస్ ఛైర్మన్ చంద్రారెడ్డి, ఎఎంసి మాజీ వైస్ ఛైర్మన్ చంద్రా వెంకటసుబ్బానాయుడు, 16వ వార్డు టిడిపి నాయకులు బషీర్, 17 వ వార్డు కౌన్సిలర్ ఖాదర్‌బాషా, ఫారెస్టు అధికారులు, మునిసిపల్ ఎఇ దుర్గా ప్రసాద్, హౌసింగ్, రెవెన్యూ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు, జన్మభూమి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బహిరంగ మలవిసర్జన నేరం

ప్రజాశక్తి-సీతారామపురం

బహిరంగ మలవిసర్జన నేరమంటూ అయ్యవారిపల్లి పాఠశాల విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన వల్ల అనేక అంటు వ్యాధులు వస్తాయని ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డిని నిర్మించుకోవాలని సూచించారు.

సంగంలో 'జన్మభూమి -మా ఊరు'

ప్రజాశక్తి-సంగం

మండలంలోని వెంగారెడ్డిపాళెం, మర్రిపాడు గ్రామాల్లో శనివారం జన్మభూమి-మాఊరు కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో తహసీల్దారు షఫీమాలిక్, ఎంపిడిఒ రఫీఖాన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు జన్మభూమి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. చంద్రన్న కానుకలు పంపిణీ చేశారు. ప్రజలు అర్జీలు అందజేశారు. అన్ని శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయరూ..

సంగం: మండలంలోని 20 పంచాయతీల్లో ఎన్‌టిఆర్ గృహాల నిర్మాణం వేగవంతం చేయాలని హౌసింగ్ ఎఇ రాజారావు తెలిపారు. మండలానికి 200 ఇళ్లు మంజూరయ్యాయని వీటి నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు. పలువురికి నివాస స్థలాల సర్టిఫికేట్లు లేకపోతే తహసీల్దారు కార్యాలయంలో వాటిని అందజేస్తారన్నారు. వెంటనే ఈ నిర్మాణాలు పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన దృశ్యాలు


యునివర్శిటీలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబునాయుడు


చిన్నారిని అభినందిస్తున్న చంద్రబాబునాయుడు






సిఎంకు బొకె అందజేస్తున్న కలెక్టర్


మాట్లాడుతున్న మంత్రి సోమిరెడ్డి